RNI Regd. APTEL No. 2009/29147 Postal Regd. No. J/NLR/078/20-22

# ఆంధ్రలక్ష్మి

జాతీయ తెలుగు వార పత్రిక



సంపుటి : 15 సంచిక : 31 ఎడిటర్ : ఎస్.కె. గౌస్‌బాషా తేది : 12-04-2024 పేజీలు : 8 వెల : 6/-

# ఊసరవెల్లి నాయకులను 'ఓటు'తో తరిమికొట్టండి..!

బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్లు, అధికారం ఎక్కడ ఉంటే అక్కడ రాజకీయ నేతలు చేరుతారు. పదవులు, డబ్బులు సమకూరేంత వరకు పార్టీ అధినేతను ఇంద్రుడూ, చంద్రుడూ అంటూ పొగుడుతారు. పార్టీ అధినేతకు, పార్టీకి వీర విధేయత ప్రకటిస్తారు. పార్టీకి అధికారం చేజారితే వెంటనే... ఎక్కడ అవకాశం ఉంటే అక్కడికి చేరిపోతారు. నిన్నటి దాక పూనకం వచ్చినట్లు ఊగిపోతూ చెడదిట్టిన పార్టీలోకి సిగ్గూ, ఎగ్గూ, బిడియం లేకుండా చేరిపోతారు. పేర్లు పెట్టి వ్యక్తిగతంగా బూతులు తిట్టుకున్నవారు తెల్లారేసరికి పార్టీ కండువాలు మార్చుకుంటూ, నవ్వు మొఖాలతో కౌగలించుకుంటూ ఫొటోలకు ఫోజులిస్తూ కనపడతారు. ఈ ఊసరవెల్లి వలస రాజకీయాలు దేశవ్యాప్తంగా జరుగుతూనే ఉన్నా అవకాశవాదానికీ, అధికార దాహానికీ పార్టీ ఫిరాయింపులకి నిలయంగా నాయకులు రాజకీయాలు నెరుపుతుండటం నిజంగా శోచనీయం. ఒకసారి పార్టీ సిద్ధాంతాలు నచ్చి, అందులో ప్రాథమిక కార్యకర్తగా ప్రవేశించి, వివిధ దశల్లో నమ్మకంగా పనిచేసిన కార్యకర్తలకే వారి శక్తి, సామర్థ్యాల మేరకు పూర్వం పార్టీ అవకాశాలు కల్పించేది. ఈ



సంస్కృతి మన దేశంలో మొదట వామపక్షాల్లో, ఆ తరువాత జనసంఘ్ బీజేపీలో కనిపించేది. వారే పార్టీ జెండాలు మోసేవారు. పార్టీ సిద్ధాంతాలను బలంగా నమ్మేవారు. ఏళ్ళ తరబడి ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా పార్టీ కోసం అహర్నిశలూ పనిచేసేవారు. వారే పార్టీ సిద్ధాంత భావ వ్యాప్తికి తోడ్పడేవారు. పార్టీ కోసం ప్రాణత్యాగాలకు సైతం వెనుకాడేవారు కాదు. కొన్నిసార్లు వివిధ అంతర్గత, బాహ్య కారణాల వల్ల పదవులు వచ్చినా, రాకున్నా పార్టీనీ, దాని సిద్ధాంతాన్నీ మనసా, వాచా బలంగా నమ్మి, గాఢంగా విశ్వసించి పనిచేసేవారు. ఇప్పుడు కాలం మారింది. ఇప్పుడు అలాంటి పార్టీలూ, పార్టీ నేతలూ కరువయ్యారు. మారుతున్న పరిస్థితులతో రాజీపడి బీజేపీ, వామ పక్షాలు కూడా పార్టీ క్రమశిక్షణకు తిలోదకాలు ఇచ్చారు. ఇప్పుడు పార్టీలు టిక్కెట్ ఇచ్చేటప్పుడు అభ్యర్థి గుణగణాలు చూడటం లేదు, పార్టీపట్ల నిజాయితీగా అంకిత భావంతో పనిచేసిన వ్యక్తేనా, కాదా! అని ఆరాతీయటమూ లేదు. ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే విలువ ఉంటుంది. ఆ విలువ కులం, మతం, ధనం ఆధారంగా నిర్ణయించబడుతుంది. రాజకీయ వారసులకూ, వలసవాదులకు, అవినీతిలో మునిగి తేలిన వారికి తమ పార్టీ వ్యతిరేకమని సిద్ధాంతాలు చెబుతూనే ఆచరణలో బీజేపీ అలాంటివారికే పార్టీ టికెట్లు ఇచ్చిన ఉదంతాలు దేశమంతటా కనిపిస్తుంది. వామపక్షాల్లో కూడా కొన్ని చోట్ల సడలింపులు ఉన్నప్పటికీ, ఇప్పటికీ కొంత మెరుగ్గా సిద్ధాంత బలంతో కార్యకర్తలు పనిచేస్తున్నారు. పాతతరం నాయకుల్లో ఈ ధోరణి ఇంచుమించు ప్రతి రాజకీయ (తరువాయి 5వ పేజీలో)




## ఆ చట్టం నిజంగా అంత పవర్‌ఫులా..?

సింపుల్‌గా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కావొచ్చు.. కవిత కావొచ్చు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టైన వారందరూ.. మొదట ఈ యాక్ట్ కింద నోటీసులు అందుకున్నవారే.. విచారణకు హాజరైన వారే. ఇంతకీ PMLA అంటే ఏంటి? ఆ చట్టం నిజంగా అంత పవర్‌ఫులా? PML యాక్ట్.. యూపీఏ సర్కార్ తీసుకొచ్చిన ఈ చట్టం చాలా పవర్‌ఫుల్. ఒక్కసారి ఈ చట్టాన్ని ఉపయోగించి నోటీసు జారీ అయ్యిందంటే.. ఇక మనం చేసేది ఏమీ లేదు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం తప్ప. నోటీసులు ఇచ్చే అధికారం లేదని ఎదురు ప్రశ్నించలేం. ఏదేనీ ఆర్థిక నేరంలో ఇన్‌వాల్వ్‌మెంట్ ఉందనే అనుమానంతో కానీ.. సాక్ష్యాధారాలు ఉన్నాయని కానీ ఈడీ అధికారులు భావించినపుడు.. విచారణకు పిలుస్తూ ఈడీ సమన్లు పంపించవచ్చు. కేసుకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లను సరెండర్ చేయాలని కోరవచ్చు. ఇలా నోటీసులు అందుకున్న వ్యక్తికి అందులోని సూచనలు ఫాలో కావడం మినహా.. మరో మార్గం లేదని PML చట్టం సెక్షన్ 50 (3) చెబుతోంది. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరుకావాలని సమన్లలో చెప్పారో.. రానని చెప్పడానికి.. లాయర్లను పంపడానికి ఆప్షన్ అనేదే ఉండదు. చచ్చినట్టు ఇండివ్యూజల్‌గా హాజరవ్వాల్సిందే. అసలు ఈ PMLA చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది..? దాని చరిత్ర ఏంటి? ఈ విషయాలు తెలుసుకోవాలంటే చాలా వెనక్కి వెళ్లాల్సిందే. 1988లో యూనైటెడ్ నేషన్స్ ఓ విషయాన్ని గుర్తించింది. డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ అలా సంపాదించిన అక్రమ సంపదనంతా.. వివిధ దేవాల ఆర్థిక వ్యవస్థల్లోకి చొప్పిస్తున్నారని.. వెంటనే సమావేశం ఏర్పాటు చేసి ఈ టాపిక్‌పై డిస్కస్ చేసింది. ఆ తర్వాత 1989 జూలైలో 7 అతిపెద్ద దేశాలు పారిస్‌లో అసెంబులై.. ఇదే టాపిక్‌పై డిస్కస్ చేశాయి. (తరువాయి 2వ పేజీలో)

## మళ్లీ మన ప్రభుత్వమే రావాలి..!




పేదలకు మంచి కొనసాగాలంటే మళ్లీ మన ప్రభుత్వమే రావాలి, కుటుంబసభ్యులతో మాట్లాడి చర్చించి ఒక నిర్ణయానికి రండి. ఎవరి వల్ల మేలు జరిగిందనే విషయాన్ని లోతుగా ఆలోచించండి. నెల్లూరు జిల్లా కావలిలో మేమంతా సిద్ధం బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు. చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. చంద్రబాబును నమ్మడం అంటే పులి నోట్లో తలపెట్టడమే అని జగన్ అన్నారు. మోసం, అబద్ధం, కుట్ర, వెన్నుపోటు కలిపితే చంద్రబాబు అని వ్యాఖ్యానించారు. వచ్చే ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించేందుకు 5 వారాల గడువు మాత్రమే ఉందన్నారు జగన్. ఈ ఎన్నికలు చంద్రబాబు, జగన్ కు మధ్య జరుగుతున్నవి కాదని.. మోసగాళ్లకు, ప్రజలకు మంచి చేసే వారికి మధ్య జరుగుతున్న ఎన్నికలు అని జగన్ అన్నారు. మే 13న జరిగే సంగ్రామంలో వైసీపీకి మద్దతివ్వాలని జగన్ విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి మద్దతివ్వడం ద్వారా పేదలు, పిల్లలు, రైతులు బాగుపడతారని జగన్ వ్యాఖ్యానించారు." మంచి చేసిన మనందరి ప్రభుత్వానికి ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. అవతలి పక్షం తోడేళ్లుగా, మోసగాళ్లుగా వస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో మన రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికలు ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబుకు, ప్రజలకు మధ్య జరుగుతున్నాయి. ఒంటరిగా ఎన్నికలను ఎదుర్కొలేక కూటమిగా వస్తున్నారు. చంద్రబాబు, దత్త పుత్రుడు వీరికి తోడు బీజేపీని కూడా కలుపుకున్నారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో మన ప్రభుత్వానికి మద్దతివ్వాలి. రాష్ట్ర ప్రజలకు జరుగుతున్న మంచి కొనసాగాలంటే మన ప్రభుత్వానికే మద్దతివ్వాలి. మేనిఫెస్టో చూపించాలంటే చంద్రబాబు భయపడ (తరువాయి 3వ పేజీలో)

www.andhralaxmitelugu.in వెబ్‌సైట్‌లో వార్తలు చూడండి!




నెల్లూరు జిల్లా సర్వేపల్లి.. బెజవాడ గోపాలరెడ్డి లాంటి మహామహుల్ని అసెంబ్లీకి పంపిన నియోజకవర్గం.. మొదటి నుంచి అక్కడ హేమాహేమీ ల్లాంటి నేతలే తలపడుతున్నారు. అయితే సర్వేపల్లి ప్రత్యేకత ఏటంటే ఇప్పటి దాకా ఎవరినీ మూడసారి ఎమ్మెల్యేగా గెలిపించలేదు అక్కడి ఓటర్లు. ఈ సారి ఆ చరిత్ర తిరగరాయక తప్పని పరిస్థితి ఏర్పడింది సర్వేపల్లి వాసులకి.. టీడీపీ నుంచి పోటీలో ఉన్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ఇద్దరూ మూడోసారి విజయం సాధించడానికి తలపడుతున్నారు. మరి రాబోయే ఎన్నికల్లో సర్వేపల్లి ఎవరికి జైకొడుతుంది..? ఈ సారి ఎవరు ఎమ్మెల్యేగా మూడోసారి ఛాన్స్ ఇవ్వని సర్వేపల్లి ఓటర్లు సర్వేపల్లిలో రెండు సార్లు గెలిచిన సోమిరెడ్డి, కాకాణి మూడో విజయం కోసం తలపడుతున్న నేతలు వరుసగా 4 సార్లు పరాజయం పాలైన సోమిరెడ్డి సానుభూతి, ప్రభుత్వ వ్యతిరేకత కలిసివస్తాయని ధీమా కాకాణికి వ్యతిరేకంగా సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్షలు వైసీపీలో వ్యతిరేకతను చక్కదిద్దుకునే పనిలో కాకాణి సర్వేపల్లిలో ఈ సారి గెలిచే దెవరు? నెల్లూరు జిల్లా అంటే రాజకీయ చైతన్యం ఎక్కువ .. రాష్ట్ర, దేశ రాజకీయాలలో ఉన్నత పదవులు అధిరోహించిన నాయకులు చాలా మంది ఈ జిల్లాలో ఉన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ ప్రాబల్యం ఉన్న నెల్లూరులో గత పదేళ్లుగా వైసీపీ హవా కొనసాగుతోంది. గత ఎన్నికల్లో టీడీపీకి జిల్లాలో ఒక్క సీటు కూడ దక్కలేదు. అయితే ఈ సారి ఎన్నికల్లో వైసీపీ స్పీడ్‌కి బ్రేక్ పడే పరిస్థితి ఉందంటున్నారు. టీడీపీ కూటమి, వైసీపీల మధ్య హెూరాహెూరీ పోరు జరగనుంది. ప్రత్యేకించి జిల్లాలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సర్వేపల్లి నియోజకవర్గంలో రాజకీయంగా యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాలు ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఈ నియోజకవర్గంలో దేశంలోనే రెండో అతిపెద్దదైన కృష్ణపట్నం పోర్టు ఉంది ... పవర్ ప్రాజెక్టులు, పోర్టు ఆధారిత పరిశ్రమలతో సర్వేపల్లి అభివృద్ధిపరంగా ముందు వరుసలో కనిపిస్తుంటుంది. ఇక వ్యవసాయంతో పాటు ఆక్వా సాగు కూడా ఎక్కువగా జరుగుతూ అవకాశాలు కల్పిస్తోంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల 31 వేల 837 మంది ఓటర్లు ఉంటే.. అందులో పురుష ఓటర్లు లక్షా 13 వేల 473. మహిళ ఓటర్లు లక్షా 18 వేల 336... ఇప్పటి వరకు ఒక ఉప ఎన్నికతో సహా 15 సార్లు ఎన్నికలు జరగ్గా.. కాంగ్రెస్ ఏడు సార్లు, తెలుగుదేశం నాలుగు సార్లు, వైసీపీ రెండుసార్లు, సిపిఐ ఒకసారి, ఇండిపెండెంట్ ఒకసారి గెలిచారు. అంతేకాదు ఈ నియోజకవర్గం నుంచి ఏ ఎమ్మెల్యే కూడా మూడుసార్లు గెలిచిన పరిస్థితి లేదు.. కాంగ్రెస్ నుంచి సివి శేషారెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు, టీడీపీ నుంచి మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైసీపీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిలను రెండేసి సార్లు ఎమ్మెల్యేలుగా గెలిపించారు సర్వేపల్లి ఓటర్లు. ఆ క్రమంలో ఈ సారి పోటీచేస్తున్న మంత్రి కాకాణి, మాజీ మంత్రి సోమిరెడ్డిల్లో ఎవరు గెలిచినా అది నియోజకవర్గ చరిత్రలో ఓ రికార్డే అవ్వనుంది. సర్వేపల్లి నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు ఓటమి పాలైన టీడీపీ నేత సోమిరెడ్డి ఈసారి సానుభూతి ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు కలిసివస్తాయని ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే 2014లో వైసీపీ నుండి ప్రస్తుత మంత్రి కాకాణి గెలుపొందారు. సోమిరెడ్డి పరాజయం పాలైయ్యారు. అయినా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికారం దక్కించుకోవడంతో సోమిరెడ్డిని ఎమ్మెల్సీ చేసిన చంద్రబాబు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా పట్టం కట్టారు. గత ఎన్నికల్లో సైతం సోమిరెడ్డిని ఓడించారు కాకాణి.. మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే కాకాణికి మంత్రిగా అవకాశం దక్కింది. అయితే వ్యవసాయశాఖ పగ్గాలు చేపట్టిన కాకాణి అధికార బలంతో కక్ష సాధింపులకు దిగు తున్నారని, రైతులకు కానీ వ్యవసాయశాఖకు కానీ ఆయన చేసిందేమి లేదని, అభివృద్ధి కంటే అవినీతే ఎక్కువ జరిగిందని సోమిరెడ్డి ఆరోపిస్తున్నారు ..కాకాని గోవర్ధన్ రెడ్డి మంత్రి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా, ఇసుక, తెల్లరాయి ఇలా దేనిని వదలకుండా దోచుకుంటున్నారని సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్షలు కూడా చేపట్టారు. ఆ క్రమంలో కాకాణికి తొత్తుల్లా మారిన యంత్రాంగం తీరు మార్చుకోకపోతే తాము అధికారంలోకి వచ్చాక వారి పనిపడతామని హెచ్చరిస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వం వచ్చాక చేసిందేమి లేదని ప్రతి పక్ష నేతలు విమర్శిస్తున్నాయి. సొంత పార్టీలో వ్యతిరేకతను చక్కదిద్దుకోవడానికే కాకాణికి టైం సరిపోవడం లేదని. ఇక ప్రజలను ఏం పట్టించుకుంటారని ఎద్దేవా చేస్తున్నాయి. మరోపక్క వైసిపి ప్రభుత్వం వచ్చాకే సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి చెందిందని, ప్రతి పేదవాడికి ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు వాలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికి చేరుతున్నాయని.. టీడీసీ ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ జరిగిందని కాకాణి ప్రశ్నిస్తున్నారు. సోమిరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు రైస్ మిల్లర్ల దగ్గర డబ్బులు దండుకుని, రైతులకు తీవ్ర అన్యాయం చేశారని సర్వేపల్లి కి సోమిరెడ్డి చేసింది ఏమి లేదని కాకాని ప్రచారం చేస్తున్నారు. ఏదేమైనా ఎన్నికలు సమీపిస్తున్న వేళ నేతల మాటల తూటాలతో సర్వేపల్లిలో పొలిటికల్ హీట్ రోజురోజుకి పెరిగిపోతుంది. మరక్కడ సోమిరెడ్డి, కాకాణిల్లో మూడో సారి ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ చరిత్ర తిరగరాసేదెవరో చూడాలి.

## ఆ చట్టం నిజంగా అంత పవర్‌ఫులా..?

(1వ పేజీ తరువాయి)

అప్పుడే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాయి. కానీ 1990లో అన్ని సభ్య దేశాలు డ్రగ్స్, నగదు అక్రమ చలామణిని నిరోధించే చట్టాలు చేయాలంది. అప్పుడు స్టార్టయ్యాయి.. అన్ని దేశాల్లో PML యాక్ట్ లు. కానీ ఇంప్లిమెంట్ కాలేదు.. 1998లోనూ ఇదే సూచన చేసింది. దీంతో 2002లో వాజ్‌పేయి సర్కార్ ఓ చట్టం తీసుకొచ్చింది. 2003లో దీనికి రాష్ట్రపతి ఆమోద ముద్ర పడినా అమల్లోకి రాలేదు. కానీ యూపీఏ సర్కార్ 2005లో కొన్ని సవరణలు చేసి అమల్లోకి తీసుకొచ్చింది. ఇది PMLA హిస్టరీ. నిజానికి PMLAకు సూపర్ పవర్స్ ఉన్నాయి. కోర్టు పర్మిషన్ లేకుండా ఎవరి ఆస్తులనైనా ఈడీ అటాచ్ చేయవచ్చు. దేశంలో మరే ఏజెన్సీకి ఈ అధికారం లేదనే చెప్పాలి. కోర్టు పర్మిషన్ లేకుండా ముందస్తు సమాచారం లేకుండా దేశంలో ఎవరి ఇంట్లో, ఆఫీస్‌లోనైనా రెయిడ్స్ చేయవచ్చు. అంతేకాదు CBI గానీ, ఇతర పోలీసులు డిపార్ట్ మెంట్స్ విచారణలో ఉన్నవారితో స్టేట్మెంట్స్ తీసుకుంటారు. కానీ ఇండియన్ evidence ACT ప్రకారం ఆ స్టేట్‌మెంట్స్‌లను కోర్టులో సాక్ష్యాలుగా పరిగణించరు. అంటే నిందితులు చెప్పిన స్టేట్ మెంట్ కు మళ్లీ పోలీసులు సాక్ష్యాలు చూపించాలి. కానీ ఈడీకి అలా కాదు. PMLA సెక్షన్ 50 అండర్2 ప్రకారం.. ఈడీ ఎవరి స్టేట్మెంట్ ఐన రికార్డు చేసిందనుకోండి, అది కోర్టులో సాక్ష్యంగా తీసుకుంటారు. ఒకవేళ ఆ వ్యక్తి తప్పుడు స్టేట్‌మెంట్ ఇస్తే.. మళ్లీ అతడి మీదే చర్యలు తీసుకుంటారు తప్ప ఈడీ అధికారులకు దీనితో ఏ సంబంధం ఉండదు. PMLAకు ఉన్న మరో సూపర్ ఏంటంటే.. నేరం రుజువు కానంత వరకు ఎవరైనా నిర్దోషిగానే ఉంటారు. కానీ ఈడీలో రివర్స్‌లో ఉంటుంది. మీరు నిర్దోషి అని నిరూపించుకునే బాధ్యత మీదే. అప్పటి వరకు మీరే దోషి. ఈడీ మోపే ఆరోపణలకు నిర్దోషి అని నిరూపించుకోవడానికి తల ప్రాణం తోకలోకి వస్తుంది. అందుకే.. ఈడీ కేసులంటే నేతలతో పాటు ఇతర రంగాలకు చెందిన సెలబ్రిటలు సైతం భయపడుతుంటారు. డ్రగ్స్.. నగదు అక్రమ రవాణా పాలిట సింహస్వప్నం PMLA. కానీ రాను రాను ఇది అధికార పార్టీ చేతుల కీలుబొమ్మగా మారి.. వారి రాజకీయ ప్రత్యర్థుల పాలిట శాపంగా మారిందన్న ప్రచారం మొదలైంది. ఎందుకంటే ఐపీసీలోని కొన్ని నేరాలను.. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్‌లోని కొన్ని నేరాలను కూడా PMLA పరిధిలోకి తీసుకొచ్చారు. సో డబ్బు వ్యవహారం కనిపిస్తే.. ఈడీ ఎంటర్‌అయిపోతుంది. ఇంటర్నెషనల్ డ్రగ్స్ మాఫియాకు చెందిన నేరస్థుడిని ఎలాగైతే ట్రీట్ చేస్తుందో అలానే మాములు నేరస్థుడిని కూడా ట్రీట్ చేస్తుంది. 2019లో ఈ చట్టానికి చేసిన సవరణలతో మనీలాండరింగ్ నేరానికి పాల్పడేవారికి.. ఇతర షెడ్యూల్డ్ నేరాలు చేసినవారికి మధ్య తేడా లేకుండా పోయింది. PML చట్టంలో సెక్షన్ 45 అనేది ఈ కేసుల్లో చిక్కుకున్న వారికి ఓ నైట్ మేర్. ఈ చట్టం కింద అరెస్టయిన వారికి బెయిల్ దొరకడం దాదాపు అసాధ్యం. జడ్జి సాటిస్‌ఫై అయితేనే బెయిల్ వస్తుంది.. లేదంటే నో ఛాన్స్. దీనికి బెస్ట్ ఎగ్జాంపుల్ కేజ్రీవాల్, కవిత కేసులే. అందుకే PMLAకు సవరణలు చేయాలని చాలా రోజులుగా డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### ఫీడ్ బ్యాక్ టు ఆంధ్రలక్ష్మి

'ఆంధ్రలక్ష్మి' వారపత్రికకు సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి.... మేము నిర్భయంగా ప్రచురిస్తాం...
మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం.

Cell : 9640300529

వార్తలకై www.andhralaxmitelugu.in చూడండి

email : Andhralaxminews@gmail.com
www. andhralakshmi@gmail.com, facebook.com/andharalaxmi

# ఎలక్షన్ వేళ... పెద్ద మొత్తంలో బంగారు, నగదు సీజ్..!

ఎన్నికల వేళ రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట వివిధ రూపాల్లో అక్రమ మార్గంలో తరలిస్తున్న వాటిపై పోలీసులు నిఘా పెడుతున్నారు. ఏలూరు జిల్లాలో ఇటీవల పెద్దయెత్తున 16 కేజీల బంగారం, 35 కిలోల వెండిని పోలీసులు సీజ్ చేశారు. పెదపాడు మండలం కలపర్రు చెక్ పోస్ట్ దగ్గర పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యానులో భారీగా బంగారం ఆభరణాలను, వెండి వస్తువులను గుర్తించారు. సరైన పత్రాలు చూపించకపోవడంతో పోలీసులు వాటిని సీజ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. హైవేలు, రహదారులపై పెద్ద ఎత్తున చెక్ పోస్టుల ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ వాహనాలు చెక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం ఆకివీడులోనూ పెద్ద మొత్తంలో డబ్బును సీజ్ చేశారు. స్కూటీలో తరలిస్తున్న 12లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు మండలం కలపర్రు వద్ద పోలీసులు పెద్ద ఎత్తున చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. తనిఖీలు చేస్తుండగా పెద్ద మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యానులో వీటిని తరలిస్తున్నారు. దాదాపు 15లక్షల రూపాయల నగదు కూడా అందులో ఉంది. దీనికి సంబంధించి పత్రాలు, ఆధారాలు చూపించాలని పోలీసులు అడిగారు. అయితే, వ్యానులో ఉన్న వ్యక్తులు సరైన పత్రాలు చూపించలేదు, సరైన సమాధానం కూడా చెప్పలేదు. దీంతో పోలీసులు నగలు, నగదును సీజ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. దీనికి సంబంధించి జాయింట్ కలెక్టర్ వివరాలు సేకరిస్తున్నారు. ఎక్కడి నుంచి బంగారం తీసుకొచ్చారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే దానిపై దర్యాప్తు జరుపుతున్నారు. కాగా.. ఎన్నికల వేళ కిలోల కొద్దీ



బంగారం, వెండి ఆభరణాలతో పాటు పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం సంచలనంగా మారింది. విజయవాడ నుంచి తీసుకొచ్చి ఏలూరులోని జువెలరీ షాపులకు ఈ ఆభరణాలను తరలిస్తున్నట్లు వాహనం డ్రైవర్ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే, దీనికి సంబంధించి పత్రాలు కానీ ఆధారాలు కానీ అతడు చూపించలేదు. దీంతో పోలీసులు నగలు, నగదును సీజ్ చేసి విచారణ జరుపుతున్నారు. నిన్న జంగారెడ్డిగూడెంలో కార్గో సర్వీస్ లో 22లక్షల రూపాయలు పట్టుబడింది. దీనికి సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరుగుతోంది. మొత్తంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు రోజుల వ్యవధిలో 50లక్షల రూపాయల నగదు, పెద్ద మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలు పట్టుబడటం సంచలనంగా మారింది. అధికారులు అప్రమత్తం అయ్యారు. తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. ఒక్క వాహనాన్ని కూడా వదలకుండా చెక్ చేస్తున్నారు.


# నాడు - నేడుతో... మారిన ఏపీ ప్రభుత్వ బడుల రూపురేఖలు

మన బడి - నాడు నేడు పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో చదువు "కొనే" రోజులు పోయి.. "చదువుకునే రోజులు" వచ్చాయి. అందమైన భవనాలు, ఆకర్షణీయమైన క్లాసురూములు.. డిజిటల్ బోర్డులు.. సౌండ్ బాక్సులు.. విద్యార్థులు కుర్చోడానికి బెంచీలు.. ఇవన్నీ ఉన్నాయంటే అదేదో కార్పొరేట్ పాఠశాలలు అనుకుంటున్నారా? అలా అనుకుంటే మీరు పొరపాటు పడినట్లే. ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలివి. నాడు-నేడుతో కార్పొరేట్ స్కూళ్లను మైమరించేలా తయారయ్యాయి ప్రభుత్వ పాఠశాలలు. ప్రభుత్వ పాఠశాలలు అంటే శిథిల భవనాలు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని ప్రమాదకర స్థితులే ఉండేవి. వర్షాకాలం వచ్చిందేంటే వరుస సెలవులే. కారుతున్న భవనాల్లో చదువు చెప్పలేక, చెరువులను తలపించే పాఠశాల ప్రాంగణంలో అడుగు పెట్టలేక ఉపాధ్యాయులే సెలవులు ప్రకటించేవారు. ఏపి ప్రభుత్వం మన బడి - నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపు





రేఖలనే మార్చేసింది. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతితో ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. ఆంగ్ల మాధ్యమాన్ని కూడా ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ పాఠశాల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సీట్లు అన్నీ ఫిలప్ అయి.. నో సీట్స్ బోర్డు కొన్ని పాఠశాలల్లో పెట్టిన సంఘటనలు చూస్తున్నాం ఇప్పుడు. మన బడి - నాడు నేడు పథకం కింద గత ఐదేళ్లలో పాఠశాలల అభివృద్ధికి 12 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించింది సీఎం జగన్ ప్రభుత్వం. 2019 నవంబరు 14న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని 44 వేల 512 పాఠశాలల రూపురేఖలను మార్చడమే ఈ పథకం అసలు ఉద్దేశం. వీటిలో కొన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు కూడా ఉన్నాయి. పాఠశాల విద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సాంఘిక, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమశాఖలు, జువైనల్ వెల్ఫేర్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్లు మన బడి - నాడు నేడు పథకాన్ని పర్యవేక్షించాయి. ఫేజ్-1లో 15 వేల 715 పాఠశాలల్లో ఈ పథకం అమలు చేశారు. ప్రస్తుతం రెండో దశ పనులు జరుగుతున్నాయి. 2019 నుంచి మూడేళ్ల వ్యవధిలో దశలవారీగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రస్తుత మౌలిక సదుపాయాలను మిషన్ మోడ్‌లో మార్చడమే నాడు-నేడు పథకం ప్రధాన ఉద్దేశ్యం. మన బడి - నాడు నేడు కార్యక్రమం కింది 9 మౌలిక సదుపాయాలను చేపట్టాలని నిర్ణయించింది ప్రభుత్వం. డిజిటల్ బోర్డులు, ఆకుపచ్చ సుద్ద బోర్డులు, భవనాలకు పెయింటింగ్, ఇంగ్లీషు ల్యాబ్, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నిచర్, నీటి సౌకర్యంతో మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, పెద్ద, చిన్న మరమ్మతులు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ, ప్రహరీ, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. దీనితో రాష్ట్రంలోని పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. సర్వ హంగులతో కార్పొరేట్ పాఠశాలల లుక్ వచ్చేసిందని చెప్పవచ్చు. చదువు పట్ల విద్యార్థులకు మరింత ఆసక్తి కలిగించేందుకోసం, అవగాహన కల్పించేందు కోసం బైజూస్ ట్యాబ్లను అందజేయడంతో విద్యార్థుల్లో బడికి వెళ్లాలన్న ఆసక్తి పెరిగింది. ఇంట్లో కూడా ట్యాబ్ చూస్తూ చదువుకుంటున్నామని, అర్థం కాకుంటే మళ్లీ మళ్లీ చూస్తూ తెలుసుకుంటున్నామని విద్యార్థులు చెబుతున్నారు. దీనికి తోడు స్కూల్ యూనిఫాం, బూట్లు, స్కూల్ బ్యాగ్, ఉచితంగా పుస్తకాల పంపిణీ, అమ్మ ఒడి పథకంతో చదువుల భారం తల్లిదండ్రులకు తగ్గిపోయింది. దీనితో డ్రాప్ అవుట్స్ సంఖ్య పూర్తిగా తగ్గింది. మన బడి - నాడు నేడు పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో చదువు "కొనే" రోజులు పోయి.. "చదువుకునే రోజులు" వచ్చాయి. ఈ పథకం పూర్తిగా అమలైతే ఆంధ్ర ప్రదేశ్ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శమవుతుందని చెప్పాల్సిందే.



# మళ్లీ మన ప్రభుత్వమే రావాలి..!

(1వ పేజీ తరువాయి)

తారు. ఎన్నికలకు ముందు రంగు రంగుల మ్యానిఫెస్టో చూపిస్తారు. ఎన్నికల తర్వాత మ్యానిఫెస్టోను పట్టించుకోరు. మ్యానిఫెస్టోను చూపించే దమ్ము, ధైర్యం చంద్రబాబుకు ఉందా? సామాజిక న్యాయానికి అర్థం నేను చెప్పాను. అక్క చెల్లెమ్మలకు, అవ్వా తాతలకు సంక్షేమం అందించాం. 14ఏళ్ళు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మేము చేసిన దాంట్లో కనీసం 10 శాతమైనా చేశారా? సచివాలయం, వాలంటీర్, రైతు భరోసా కేంద్రం .. విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ.. ఇంగ్లీష్ మీడియం స్కూల్ .. మహిళా పోలీస్ .. అక్క చెల్లెమ్మల ఫోన్లలో దిశా యాప్.. వాలంటీర్ వ్యవస్థ ఎక్కడ చూసినా ఉంది. అందుకే ధైర్యంగా ఇన్ని చేశాను అని చెబుతున్నా. ప్రతి కుటుంబానికి మంచి చేశాను కాబట్టి ధైర్యంగా చెబుతున్నా. ప్రతి కుటుంబంలో మంచి జరిగి ఉంటేనే నాకు మద్దతివ్వమని కోరుతున్నా. ఈ మంచి మరో ఐదేళ్ల పాటు కొనసాగాలంటే ఓటు ద్వారా మద్దతివ్వాలి. ఈ ఓటుతో ప్రజల తలరాతలు మారుతాయి. కుటుంబసభ్యులతో మాట్లాడి చర్చించి ఒక నిర్ణయానికి రండి. ఎవరి వల్ల మేలు జరిగిందనే విషయాన్ని లోతుగా ఆలోచించండి. 2014లో చంద్రబాబు ఇదే కూటమిగా ఏర్పడి అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చారు. ముఖ్యమైన హామీలను చంద్రబాబు ఒక కరపత్రాన్ని విడుదల చేశారు. మోదీ, పవన్ కళ్యాణ్ ఫోటోలు కూడా ఈ కరపత్రంలో వేశారు. రైతులకు రుణమాఫీ, పొదుపు సంఘాలకు రుణమాఫీ పూర్తిగా చేస్తామని చెప్పారు. కానీ అమలు చేయలేదు. ఇంటింటికీ ఉద్యోగం, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. మరి ఇచ్చారా? ప్రత్యేక హోదా ఏమైనా తెచ్చారా? ఇప్పుడు కూడా ఇదే కూటమి మరోసారి ఎన్నికలకు వస్తోంది. మరోసారి రంగు రంగుల పేపర్లతో మేనిఫెస్టో తెస్తున్నారు. సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ అంటున్నారు.. ప్రజలు నమ్ముతారా? చంద్రబాబును నమ్మితే ప్రజలు మోసపోవడమే. ప్రజలంతా స్టార్ క్యాంపైనర్లుగా మారి పేదవాడి ఇంటికి వెళ్లి నిజాలు చెప్పి వారిని కూడా స్టార్ క్యాంపైనర్లుగా మార్చాలి" అని జగన్ అన్నారు.




## నెల్లూరులో వైసీపీ పెద్ద సాహసం..
## విజయం ఖాయమేనా...?

నెల్లూరంటే చేపల పులుసుకే కాదు.. అందులోని మసాలా ఘాటు లాంటి రాజకీయానికి కూడా ఫేమస్. ముఖ్యంగా నెల్లూరు సిటీ నియోజకవర్గం ఇంకాస్త హీటు. ఈసారి ఎన్నికల్లో.. వైసీపీ, టీడీపీ మధ్య పెద్ద యుద్ధమే జరగబోతోంది. అధికార, ప్రతిపక్షాల మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ కనిపిస్తోంది. వ్యూహా, ప్రతివ్యూహాలు, ఎత్తుకుపై ఎత్తులతో సిటీ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అనూహ్య రాజకీయ పరిణామాలకు వేదికగా మారిన నెల్లూరు సిటీలో గెలుపు వైసీపీకి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారింది.. టీడీపీ నుంచి బరిలోకి దిగుతున్న మాజీ మంత్రి నారాయణకు చెక్ చెప్పేందుకు అన్ని అస్త్రాలు ప్రయోగిస్తోంది వైసీపీ. నెల్లూరు పాలిటిక్స్ ఎంత హీట్ పుట్టిస్తాయో.. అంతే ఇంట్రస్టింగ్‌గానూ ఉంటాయ్. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఎప్పుడూ వాడివేడి రాజకీయ యుద్ధమే జరుగుతుంటుంది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న నెల్లూరు సిటీ.. ఇప్పుడు వైసీపీకి అడ్డా. 2014 నుంచి ఇక్కడ ఫ్యాన్ పార్టీనే గెలుస్తూ వస్తోంది. నెల్లూరు సిటీ సెగ్మెంట్‌లో మొత్తం 28 డివిజన్లు, లక్షా 56 వేల ఓట్లు ఉన్నాయి. సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఆనం కుటుంబీకులు ఐదు సార్లు గెలిచిన నెల్లూరు సిటీ.. గత రెండు సార్లు బీసీ నేత అనిల్‌కుమార్ యాదవ్ వశమైంది. నియోజకవర్గ మార్పు చేర్పుల్లో భాగంగా అనిల్‌కుమార్ యాదవ్.. నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా వెళ్లిపోవడంతో ఈసారి మైనార్టీ నేత ఖలీల్‌కు అవకాశం ఇచ్చింది వైసీపీ. ఆయనపై టీడీపీ సీనియర్ నేత నారాయణ పోటీ చేస్తున్నారు. ఆర్థికంగా బలమైన నేత నారాయణపై మైనార్టీ నేతను ప్రయోగించడం ద్వారా వైసీపీ పెద్ద సాహసమే చేస్తుందని అంటున్నారు పరిశీలకులు. ఇక గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిన నారాయణ ఈసారి ఎలాగైనా గెలవాలని గట్టిగా ప్రయత్నిస్తుండగా, అధిష్టానం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖలీల్ అహ్మద్ చెమటోడ్చుతున్నారు. మొత్తానికి సింహపురి సింహాసనం కోసం ఇద్దరూ ఢీ అంటే ఢీ అనే స్థాయిలో తలపడుతున్నారు. నెల్లూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి పోటీ చేస్తుండటంతో ఖలీల్ అహ్మద్‌కు కొండంత అండ లభించినట్లైంది. విజయసాయి అండదండతో ఆర్థికంగా బలమైన నేత నారాయణను మట్టికరిపిస్తానని అంటున్నారు ఖలీల్ అహ్మద్. గత పదేళ్లుగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో వైసీపీకే అనుకూలంగా తీర్పునిస్తోంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా సింహపురిలో జెండా పాతాలని వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది టీడీపీ. నెల్లూరు సిటీ నియోజకవర్గాన్ని తానే అభివృద్ధి చేశానని ప్రచారం చేస్తోంది. మాజీ మంత్రి నారాయణను మరోమారు బరిలోకి దింపిన టీడీపీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. వైసీపీలోని కీలక నేతలను పార్టీలోకి చేర్చుకుని బలం, బలగం పెంచుకున్న టీడీపీ.. గెలుపుపై ధీమాగా కనిపిస్తోంది. 2014 నుంచి 2019 వరకు మంత్రిగా పనిచేసిన నారాయణ.. 2019 ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసి ఓడిపోయారు. విద్యాసంస్థల అధినేతగా, టీడీపీలో కీలక నేతగా ఎదిగిన నారాయణ.. మంత్రిగా సిటీలో తనదైన వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గత ఎన్నికల్లో ఓడినా, నియోజకవర్గాన్ని మాత్రం వదల్లేదు. ఎప్పటికప్పుడు క్యాడర్‌తో సమన్వయం చేసుకుంటూ విజయం కోసం పరితపిస్తున్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రచారం చేస్తూ ఒక్కచాన్స్ ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నారు. ఐతే నారాయణ ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు వైసీపీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్. ప్రస్తుతం నెల్లూరు డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తున్న ఖలీల్.. నారాయణ చెబుతున్నవన్నీ అబద్ధాలే అని తిప్పికొడుతున్నారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేసి.. కార్పొరేషన్‌పై భారం మోపారని విమర్శిస్తున్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాకే నెల్లూరు అభివృద్ధి చెందిందని తన వాదన వినిపిస్తున్నారు ఖలీల్ అహ్మద్. టీడీపీ అభ్యర్థి నారాయణతో పోల్చితే ఆర్థికంగా బలం లేని ఖలీల్.. పార్టీ పెద్దల అండతో తగ్గేదేలే అన్నట్లు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా వైసీపీ కీలకనేత విజయసాయిరెడ్డి ఎంపీగా పోటీ చేస్తుండటం ఖలీల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందంటున్నారు. ఇక పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి కూడా ఖలీల్ అహ్మద్ విజయానికి శక్తివంచన లేకుండా పని చేస్తున్నారు. మైనార్టీలకు తొలి అవకాశం ఇచ్చిన పార్టీగా ఆ వర్గానికి చెందిన ఓట్లపై ఫుల్‌ఫోకస్ పెట్టిన వైసీపీ తన స్థానం పదిలమని కాన్ఫిడెన్స్ చూపిస్తోంది. మొత్తానికి రెండు పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఏ అవకాశాన్నీ వదులుకోకుండా ఎత్తులకు పైఎత్తులు వేస్తూ రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నాయి. ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి నారాయణ కుటుంబం మొత్తం ప్రచార పర్వంలో మునిగిపోయింది. నారాయణతోపాటు ఆయన భార్య రమాదేవి, కూతురు కూడా గడపగడపకు తిరుగుతున్నారు. ఇక ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూపంలో అదనపు శక్తిని కూడగట్టుకున్న నారాయణ ఈసారి ఎలాగైనా టీడీపీ జెండా ఎగరేస్తాననే ధీమా ప్రదర్శిస్తున్నారు. ఇదే సమయంలో వైసీపీ కూడా ప్రచారంలో ఎక్కడా తగ్గడం లేదు. పార్టీలో ఇటీవల జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని తన కంచుకోటను కాపాడుకోడానికి మైనార్టీని బరిలోకి దింపిన వైసీపీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. సీఎం జగన్‌కు నమ్మిన బంటు లాంటి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఎంపీ అభ్యర్థిగా పంపాల్సిరావడంతో సిటీలో 46వేల ఓట్లున్న మైనార్టీకి చాన్స్ ఇచ్చింది. దీంతో సిటీతో పాటు ఎంపీ సీటులోనూ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని చూస్తోంది వైసీపీ. మొత్తానికి వ్యూహ ప్రతివ్యూహాలతో రెండు పార్టీలూ సమఉజ్జీలుగా కనిపిస్తున్నాయి. ఇక ముందు జరిగే రాజకీయ పరిణామాలే రాజకీయాన్ని డిసైడ్ చేసే పరిస్థితిని సూచిస్తున్నాయి.

## పోలీసులపై అసత్య కథనాలు..
## ఏపీ ఐపీఎస్ అసోసియేషన్ సీరియస్..

తెలుగు రాష్ట్రాలలో ఎన్నికలు సమ్మర్ హీట్ ను మరింత పెంచుతున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీలు తమదైన స్టైల్ లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే నాలుగు రాష్ట్రాలు, లోక్ సభకు ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో ఏపీలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. వైనాట్ 175 అంటూ వైఎస్సార్సీపీ ఎన్నికల ప్రచారంతో ప్రజల్లోకి వెళ్తుంది. అదేవిధంగా సిద్దం సభల ద్వారా ప్జలకు చేసిన మంచిని సీఎం జగన్ మోహన్ రెడ్డి వివరిస్తున్నారు. మరోకసారి తమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని అభ్యర్థిస్తున్నారు. ఇక మరోవైపు ఏపీలో.. టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి ఎన్నికల బరిలో నిలబడ్డాయి. ఆయాస్థానాలలో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు పావులుకదుపుతున్నారు. ప్రస్తుతం దేశంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇక ఆయా రాజకీయ పార్టీలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. వైసీపీలు తీసుకొచ్చిన వాలంటీర్ వ్యవస్థపై టీడీపీ ఈసీకి అనేక మార్లు ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా ఏపీ లోని అనేక జిల్లాలలో ఐపీఎస్ అధికారులు, అధికార వైసీపీలకు మేలుచేసేలా ప్రవర్తిస్తున్నారని, టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసింది. దీంతో ఆయా జిల్లాలలో ఎన్నికల సంఘం ఎస్పీలను మార్చి, కొత్త వారిని నియమించింది. అయితే.. ఎన్నికల సంఘం కొత్తగా నియమించిన వారిపై కూడా కొన్నిపత్రికలలో వివాదాస్పద కథనాలు ప్రచురించాయి. ముఖ్యంగా ఒక దినపత్రికలో అనేక వరుస కథనాలు పోలీసులపై ప్రచురితమౌతున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై ఏపీ ఐపీఎస్ పోలీసుల సంఘం సీరియస్ గా స్పందించింది. ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్న అధికారుల పట్ల అసత్య కథనాలు ప్రచురించడం సబబు కాదన్నారు. ఎలాంటి ప్రూఫ్‌లు లేకుండా కొన్ని పత్రికలు, పొలిటికల్ పార్టీలు పనిగట్టుకుని పోలీసులపై విషపూరిత ప్రచారాలు చేస్తున్నాయన్నారు. తాము పగలనక,రాత్రనక, కుటుంబాలకుదూరంగా ఉండి ఎన్నో ఒత్తిడుల మధ్య విధులు నిర్వహిస్తుంటామని పేర్కొన్నారు. ఇకమీదట సరైన ఆధారాలు లేకుండా, కథనాలు లేదా వ్యాఖ్యాలు చేసే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, పొలిటిషియన్స్ లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సంఘాన్ని కలిసి దీనిపై చర్యలు తీసుకునేలా చూస్తామంటూ ఏపీ ఐపీఎస్ అధికారుల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది.

## ఏపీలో పలువురు ఐఏఎస్‌లకు పోస్టింగులు




ఏపీలో పలువురు ఐఏఎస్‌లకు పోస్టింగులు దక్కాయి. ఇటీవల కాలం లో ఎన్నికల అధికారులపై ఈసీ వేటు వేసింది. బోగస్ ఓట్ల వ్యవహారంలో ప్రతిపక్షాల ఫిర్యాదులపై అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి గౌతమి, కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి రాజబాబు, తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీషాలను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. అయితే తాజాగా వీరికి పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వుల జారీ అయ్యాయి. ఈసీ ఆదేశాలతో ఎన్నికలతో సంబంధం లేని శాఖలను కేటాయించారు. ఈ ముగ్గురితో పాటు మరో ముగ్గురికి సైతం పోస్టింగులు దక్కాయి. ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈవోగా లక్ష్మీషా, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీగా రాజాబాబు, టీటీడీ జేఈవోగా గౌతమిని నియమించారు. వీరితో పాటు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్‌గా అంబేద్కర్, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీగా వెంకట్రామిరెడ్డి నియమించారు. సీసీఎల్ఏ కార్యదర్శిగా ప్రభాకర్ రెడ్డికి అనదపు బాధ్యతలు అప్పగించారు.

## ఏపీలో మద్యం అమ్మకాలపై ఆంక్షలు..!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఎన్నికల సమయంలో మద్యం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వ రిటైల్ దుకాణాల్లో మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించింది ఎలక్షన్ కమిషన్. ఎంసీసీ నిబంధనల ప్రకారం గత సంవత్సరం 2023 ఏప్రిల్ నెలలో ఏ షాపు ఎంత వరకు అమ్మకాలు జరిగాయో అంతే మేరకే అమ్మకాలు జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది ఇదే నెలలో నమోదైన మద్యం అమ్మకాల పరిమాణాన్ని బట్టి రిటైల్ దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యం పరిమాణాన్ని నిర్ణయిస్తున్నారు అధికారులు. అదేవిధంగా ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి సరఫరా అయ్యే మద్యం సప్లయ్ పై ఎక్సైజ్ అధికారులు ఫోకస్ పెట్టారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు మద్యాన్ని దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీనికితోడు వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో మద్యం, బీరుకు డిమాండ్ భారీగా ఉంది. దీంతో మద్యం రిటైల్ దుకాణాలు ఇష్టానురంగా విక్రయాలు జరుపుతుండటంతో ఏపీఎస్ బీసీఎల్ డిపోల నుంచి భారీగా మద్యం నిల్వలను ఎత్తివేయాల్సి వస్తోంది. ఈ తరుణంలో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగి మద్యం నిల్వల ఎత్తివేత, అమ్మకాలపై ప్రతిరోజూ జిల్లా ఎన్నికల అధికారికి నివేదికలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం ఎక్సైజ్ అధికారులు మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించడంతో పాటు నిల్వల ఎత్తివేతపై కూడా ఆంక్షలు విధించారు.

# తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతిస్వరూప్‌కు అక్షర నివాళి..!



"నమస్కారం.. ఈ రోజు వార్తల్లో ముఖ్యాంశాలు.." అంటూ ఏళ్లపాటు అలరించిన ఆ గాత్రం మూగబోయింది. తడబాటు లేకుండా స్పష్టమైన ఉచ్చరణతో ఎప్పుడు విన్నా టక్కున గుర్తు పట్టే స్వరంతో తెలుగు ప్రజలకు ఆయన చేరువ అయ్యారు. రేడియోల శకం ముగిసి, టీవీ వార్తలు మొదలయ్యాక దూరదర్శన్‌లో మొదట్లో సాయంత్రం పూట మాత్రమే వార్తలు ప్రసారం అయ్యేవి. దూరదర్శన్‌లో తొలి తెలుగు న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్‌కు ఓ గుర్తింపు ఉంది. తెలుగు టీవీ వార్తలకు ఓ ఐకాన్‌గా వారు తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. ఎంతోమంది న్యూస్ రీడర్లకు వారు స్ఫూర్తిగా నిలిచారు. "నమస్కారం.. ఈ రోజు వార్తల్లో ముఖ్యాంశాలు.. బాలల దినోత్సవం సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో బాలల దినోత్సవాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్ టీ రామారావు ప్రారంభించారు" తెలుగు టీవీ చరిత్రలో తొలిసారి ప్రసారమైన వార్తల్లోని ముఖ్యాంశాలు ఇవి. దూరదర్శన్ చానల్‌లో సాయంత్రం 7 గంటలకు 1983 నవంబర్ 14వ తేదీన ఈ వార్తల బులిటెన్ ప్రారంభం అయ్యింది. అప్పట్లో ఒక సంచలనం. వాటిని లైవ్‌లో చదివి వినిపించింది, ఇప్పుడు చాలా మంది న్యూస్ రీడర్లు గురువుగా భావించే శాంతి స్వరూప్. జీవన, సాహిత్య సారాన్ని అవపోసన పట్టి యాంకర్ బాధ్యతను సమర్థంగా నిర్వహించారు. 2011లో పదవీ విరమణ చేసే వరకూ ఆయన వార్తలు చదివారు. 41 ఏళ్ల క్రితం నవంబర్ 14వ తేదీన ఈ వార్త బులిటెన్ ప్రారంభం అయ్యింది. మొదటి వార్త బులిటెన్ చదవిన శాంతి స్వరూప్ టీవీ చరిత్ర పుటల్లో తన పేరును శాశ్వతంగా నమోదు చేసుకున్నారు. అప్పుడు ఉన్నది దూరదర్శన్ ఒక్కటే. అందుకే.. ఊరి మొత్తంలో టీవీ ఉన్న ఒకరిద్దరి ఇంటికే అందరూ వెళ్లేవారు. సాయంత్రం 7 గంటలైతే వార్తలు తెలుసుకునేందుకు టీవీలకు అతుక్కుపోయేవారు. ఆ సమయంలో వచ్చే మ్యూజిక్ వింటే చాలు, ఎక్కడున్నా అందరూ పరిగెత్తుకుని వచ్చే వాళ్లు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన శాంతి స్వరూప్ చిన్ననాటనే తండ్రి, ఆ తర్వాత... పెంచి పెద్దచేసిన అన్నయ్య కాలం చేయడంతో కుటుంబ భారం మోసారు. శ్రద్ధాసక్తులతో వార్తలు చదివిన ఆయన 1980లో సహ సీనియర్ యాంకర్ రోజా రాణిని జీవిత భాగస్వామిగా చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. వారిద్దరూ ఐఐటీ చేసి అమెరికాలో స్థిరపడ్డారు. 1977 అక్టోబర్ 23 లోనే లాంఛన ప్రాయంగా హైదరాబాద్ వచ్చిన దూరదర్శన్ ఎదుగుదలను దగ్గరి నుంచి చూసిన శాంతి స్వరూప్ తెలియని నాటి తరం తెలుగు వాళ్ళు బహుశా ఉండరేమో! వార్తలు చదవడం కోసం ఆయన 1978లో ఉద్యోగంలో చేరినా ఆయన వార్తలు చదవడానికి 1983 దాకా వేచి చూడాల్సి వచ్చింది. నాలుగు దశాబ్దాల క్రితం కనీసం టెలీ ప్రాంప్టర్ కూడా లేదు. దీంతో స్క్రిప్ట్ పేపర్లనే బట్టీ పట్టి వార్తలు చెప్పేవారు శాంతి స్వరూప్. వార్తలు ప్రారంభమైన పదేళ్ల పాటు అదే పరిస్థితి. టెలీ ప్రాంప్టర్ లేదు.. "తప్పులు జరగకుండా చాలా బట్టీ పట్టి వార్తలు చదివే వాడిని.. మిగిలిన వారు అందరూ భయపడ్డారు ఎక్కడ తప్పులు చదువుతానోనని" అంటూ ఆనాటి జ్ఞాపకాలని ఆయన అంటారు. అలా పదేళ్ల పాటు స్క్రిప్ట్ పేపర్లతోనే వార్తలు చదువుతూ వచ్చారు. దూరదర్శన్‌లో 2011లో పదవీ విరమణ చేసే వరకూ ఆయన వార్తలు చదివారు. చాలా మంది న్యూస్ రీడర్లు శాంతి స్వరూప్‌ను తమ గురువుగా భావిస్తుంటారు. సాహిత్యంపై పట్టున్న శాంతి స్వరూప్.. భోపాల్ గ్యాస్ దుర్ఘటన మీద "రాతి మేఘం' అనే నవల రాశారు. క్రికెట్ మీద మక్కువతో 'క్రేజ్', సతీ సహగమన దురాచారానికి వ్యతిరేకంగా 'అర్ధాగ్ని' అనే నవల రాశారాయన. యాంకరింగ్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. న్యూస్ రీడర్‌గా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును కూడా అందుకున్న శాంతి స్వరూప్ గుండెపోటుతో హైదారాబాదులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2024 ఏప్రిల్ 5న తుదిశ్వాస విడిచారు. ఆయన సహచారిణి రోజారాణి కాలం చేశారు. అక్షరాలా శాంతి స్వరూపమే అయిన ఈ విశిష్ట వ్యక్తికి నివాళులు !

# ఒకవైపు ప్రచారం... మరోవైపు పోలీసుల నిఘా..!

జిల్లాలో ఎన్నికల హడావుడి మొదలైంది. ఒకవైపు నియోజకవర్గ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేస్తుండగా, మరోవైపు పోలీసులు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు తమవంతు పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, గత ఎన్నికల్లో కేసులు ఉన్న వారిని బైండోవర్లు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 6వేల మందికిపైగా వారిని పోలీసులు బైండోవర్లు చేసుకున్నారు. రౌడీ మూకలు, షీట్లు ఉన్న వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కేంద్రం నుంచి మూడు కంపెనీలు వచ్చాయి. వారి ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రతి వీధిలో కవాతు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా గతంలో జరిగిన ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కొన్ని ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. ఇప్పటికే సెక్టార్, రూటు అధికారులు అన్ని పోలీసుస్టేషన్లను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లోని స్థితిగతులపై నివేదిక కూడా సమర్పించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టాలనే అంశంపై పోలీసు సిబ్బంది స్టేషన్ల వారిగా రంగంలోకి దిగారు. తనిఖీ కేంద్రాల్లో 24×7 వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. నగదు, మద్యం అక్రమంగా తరలిస్తున్నా.. వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసుస్టేషన్లలో సమస్యాత్మక ప్రాంతాలు ఉండే వాటిలో భద్రతా సిబ్బందిని ఎక్కువగా నియమించే అవకాశం ఉంది. పీఎస్‌లు ఉన్నచోట 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పీఎస్‌కు ఎంత దూరం వరకు జన సమూహాలు, గుంపులను రాకుండా చేయాలి? ఆయా ప్రాంతాల్లో ఎంత మంది సిబ్బందిని నియమించాలి? పీఎస్‌లో ఎంత మంది సిబ్బంది ఉండాలి? ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఆవశ్యకత, ఇలా అన్నింటిపై ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నివేదికను రూపొందిస్తున్నారు. అందులో భాగంగా ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ. 2.70 లక్షల నగదును బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేదాయపాళెం, కొడవలూరు, కావలి ఒకటో పట్టణం, రూరల్, జలదంకి, చేజర్ల, మర్రిపాడు, కలువాయి, సైదాపురం, ఒలేటివారిపాళెం పరిధిలో 196 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారులు జిల్లావ్యాప్తంగా 123 బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రూ. 50 వేలకు మించి నగదు, ఎక్కువగా నగలు తీసుకెళ్లరాదన్నారు. అవసరాల రీత్యా తీసుకెళ్లాల్సి వస్తే తగిన ఆధారాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అందరూ విధిగా పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై సీ విజిల్ యాప్, డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ఊసరవెల్లి నాయకులను 'ఓటు'తో తరిమికొట్టండి..!

(1వ పేజీ తరువాయి)

పార్టీలోనూ ఉండేది. కొన్నిసార్లు సిద్ధాంత విభేదాలు వస్తే బహిరంగంగా తాను ఎందుకు ఏ కారణాలతో విడిపోతున్నాడో పార్టీ అతర్గత సమావేశాల్లో గట్టిగా వాదించేవారు. ఆ తరువాత బహిరంగ పత్రికా ప్రకటన చేసి మరో పార్టీని స్వయంగా స్థాపించేవారు. అంతే కానీ పూటకో పార్టీ మారే అయారాం, గయారం సంస్కృతి ఉండేదికాదు. ఇప్పుడు వారూ, వీరూ అనే తేడా లేదు. అన్ని పార్టీలు ఈ దుష్ట సంస్కృతికి గేట్లు తెరిచాయి. అధికారం ఎక్కడ ఉంటే పోలో అంటూ అక్కడ చేరిపోతారు. కండువాలు మార్చుకోవడం ఇప్పుడు ఎంత తేలికైందో...! జెండాలు మోసినోళ్లకి కాకుండా వ్యక్తిగత ఎజెండాలతో కండువాలు మార్చిన వాళ్ళకి అవకాశాలు ఇస్తున్నంతకాలం పార్టీ పిరాయింపులు జరుగుతూనే ఉంటాయి. వారిపై స్పీకర్లు చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలి. కానీ స్పీకర్లు కూడా అధికార పార్టీకి అనుకూలంగానే విధేయత ప్రకటిస్తున్నారు. ఇలాంటి ఫిరాయింపు నేతలకు ప్రజలు కూడా 'కర్రుకాల్చి వాత పెట్టినట్లు' రానున్న ఎన్నికల్లో ఓడించి ప్రజా చైతన్యసత్తా చాటాలి. ఒక సిద్ధాంతం, కట్టుబాటు లేకుండా ఇలా పార్టీ ఫిరాయించే వారికి గట్టిగా బుద్ధి చెప్పితీరాల్సిన సమయం ఆసన్నమయింది. ఒక పార్టీలో పుట్టి,పెరిగి, ఎమ్మెల్యేలుగా, ఎంఎల్‌సీలుగా, ఎంపీలుగా, మంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులుగా అనేక అవకాశాలను పార్టీ కలిపిస్తే కూడా తృప్తి లేకపోవటం, పార్టీకి కనీసం కృతజ్ఞత చూపక పోవటం అమానుషం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని వీడిన వారిని ఓటర్లు ఉపేక్ష చేయకూడదు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ బీఆర్ఎస్ మూడు ప్రధాన రాజకీయ పార్టీలు పోటీలు పడి మరీ, వలసలను ప్రోత్సహిస్తున్నాయి. నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి అధికార దాహంతో అవకాశాలను వెతుక్కుంటూ ప్రతి ఎన్నికలకు పార్టీలు మారుస్తూ మారుతూ ఊసరవెల్లిని సిగ్గుపడేలా చేస్తున్నారు. తెప్పలుగ చెరువు నిండిన, కప్పలు పదివేలు చేరు అనే సుమతీ శతక కారుని భాష్యాన్ని నిజం చేస్తున్నారు. ఒక పార్టీలో ఉన్న నాయకుడికి మరొక పార్టీ ఎంపీ లేదా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వటం, మరొకవైపు ఏ పార్టీ టికెట్ ఇస్తే నాయకులు ఆ పార్టీలోకి మారడంతో పార్టీలు డ్రామా కంపెనీలుగా, నాయకులు డ్రామా నటులుగా మారిపోయినట్టుగా కనిపిస్తుంది. అయితే, వీరు తెలుసుకోవాల్సింది ఏంటంటే ఈ పార్టీ ఫిరాయింపుల హవా కొంత కాలమే కొనసాగుతుంది. నాయకులు తమ వ్యక్తిత్వాన్ని, నమ్మకాన్ని, విశ్వాసాన్ని, ప్రజాస్వామ్య విలువలను... పదవులకోసం, ధనం కోసం, ఇతర వ్యాపార, ఆర్థిక ప్రయోజనాల కోసం అమ్ముకొనటానికి సిద్ధమైనప్పుడు సంతలో అంగడి సరుకవుతారే గానీ, విలువలు గల ప్రజా ప్రతినిధులు కాలేరు. వారు చరిత్ర హీనులుగా, రాజకీయ కళింకితులుగా చరిత్రలో శిలాక్షరాలతో లింఖించబడతారే గాని నిష్కకళింకితులు కాబోరు. ఈ అపవిత్రపు డాగు, మచ్చ చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది. అందరూ, అన్ని విషయాలను గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారి తీర్పు భయంకరంగా ఉంటుంది. అన్ని రోజులూ మనవి కావు. మరో సారి ప్రజలు విజ్ఞత చూపి అవకాశవాద, ఫిరాయింపుదార్లను గుర్తు పెట్టుకుని మరీ ఓడిస్తే, వారికి గుణపాఠం నేర్పినట్లు అవుతుంది.

# సార్వత్రిక ఎన్నికలు.. ఎవరి ప్రభావం ఎంతెంత..?

భారతదేశంలో రాజకీయాలు 2024 సార్వత్రిక ఎన్నికల శంఖారావంతో ఊపందుకున్నాయి. మాజీ ఎన్నికల కమిషనర్ టి.ఎన్.శేషన్ చెప్పినట్లుగా దశ మహాపాతకాలు దేశ ఎన్నికల వ్యవస్థను కరకర నమిలేస్తున్నాయి. 2024 ఎన్నికలకు దళిత బహుజనులు లౌకికవాద భావ జాలంతో ముందుకు నడవాల్సిన చారిత్రక సందర్భం ఇది. ఓటు దేశ ప్రజలకు జీవధాతువు. ఐదేళ్లపాటు మన జీవిత నిర్మాణానికి అది ఒక ఆయుధం. ఓటు విలువ అత్యున్నతమైనది. అమూల్యమైనది. అది మానవ విలువలతో సమానమైనది. అందుకే అంబేద్కర్ రాజ్యాధికారమే ప్రధానమైన కీ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎవరి ప్రభావం ఎంతో చూద్దాం. వృత్తికారులే కాక శ్రామికశక్తులు కూడా అయిన బీసీలకు రాజ్యాధికారంలో సమభాగం ఇవ్వటంలో అన్ని పార్టీలు వెనుకబడి వున్నాయి. చాలామంది బీసీలు తమ విముక్తిదాత అయిన పూలే గురించి ఈనాటికీ తెలుసుకోలేకపోతున్నారు. మహాత్మాపూలే ఓబీసీలకు అర్థమైనపుడే వారిలో సామాజిక రాజకీయ చైతన్యం వస్తుంది. శూద్ర అతి శూద్రులకు విద్యను నిరాకరించిన అంశాల మీద జ్యోతిరావుపూలే పోరాడి వీరిలో విద్యా చైతన్యాన్ని కల్పించాడు. పూలే ఉద్యమం లేకుంటే నేటికీ కొందరి చేతుల్లోనే విద్యా సంస్కృతి, చరిత్ర, ప్రబోధం, మిగిలిపోయి వుండేది. కాని విద్యను అందరికీ సార్వత్రికం చేయటానికి ఆయన చేసిన పోరాటాన్ని మనం అవగాహన చేసుకోగలిగితేనే, ఏ ఆధిపత్య వర్గాలు కొన్నివేల సంవత్సరాలు విద్యను స్వాయత్తం చేసుకొని ఈనాటి నిరక్ష్య రాస్యతకు, పేదరికానికి కారణమవుతున్నాయో తెలుసుకోగలుగుతాం. భారతదేశానికి మొదటి ఎన్నికలు జరిగినప్పటి నుండి ముస్లింలకు పార్లమెంట్‌లోను, అసెంబ్లీలోను ప్రాతినిధ్యం ఇస్తు



వస్తున్నారు. ఒకసారి మనం ఆ గణాంకాలను చూసి ముస్లింలను బీజేపీ ఎంత నిర్లక్ష్యం చేసిందో ఒకసారి చూద్దాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ముస్లిం సభ్యులు 76 మంది ఎన్నికయ్యారు. దామాషా పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో ముస్లిం ఎంపీలు గణనీయంగా ఎన్నిక కాగా. ఆనాడు ముస్లింల జనాభా 6% కంటే తక్కువగా వున్నారు. మొదటి రాజ్యసభలో 10.5% కంటే కొద్దిగా ఎక్కువ ముస్లిం సభ్యులున్నారు. ముస్లింలే ఎక్కువగా వున్న ప్రాంతాల్లో సైతం దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిగినపుడు 49 మంది ముస్లింలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎపుడూ ముస్లింల బలానికి తగినంత మంది పార్లమెంట్‌కు ఎన్నిక కాలేదు. 2014లో బీజేపీ స్వల్ప మెజారిటీతో పార్లమెంట్ ఎన్నికలలో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా కనీసం ఒక ముస్లిం మంత్రి కూడా ఎన్నిక కాలేదు. హిందూత్వ బిజెపి మెజారిటీ జనాభాతో ప్రాతిపదికగా అధిక సీట్లు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న నేపధ్యంలో 2024లో జరగనున్న 18వ లోక్‌సభ ఎన్నికల్లో హిందూత్వ మెజారిటీ జనాభా దన్నుతో బీజేపీ చెలరేగిపోతున్నందున ముస్లింలంతా ఏకం కావచ్చునని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. హిందూ జాతీయవాద ప్రభుత్వం ముస్లింలను అణిచివేస్తున్నందున ముస్లింలు ఏకమై సెక్యులర్ పార్టీలకు ఓట్లు వేస్తారని ఫిబ్రవరిలో ఒక పరిశోధనా పత్రం పేర్కొంది. బీజేపీపై పోటీ చేస్తున్న బలమైన అభ్యర్థికి ఓట్లు వేస్తారని ఆ పరిశోధన అంచనా వేసింది. క్రైస్తవులు భారత దేశానికి ఇతర దేశాల నుండి వలస వచ్చినవారు కాదు. హిందూమతంలో అస్పృశ్యతకు, నిరాదరణకు గురైన వారు క్రైస్తవ మతంలోకి వెళ్ళి అక్షర విద్యను నేర్చుకున్నారు. క్రైస్తవమతం అపుడు మతంగా కాకుండా ఉద్యమంగా వచ్చింది. అందుకే దళితులు ఎక్కువమంది క్రైస్తవ మతంలో చేరి అక్షర విద్యను నేర్చుకున్నారు. వారిని నిరాకరించడం, జనరల్ సీట్లలో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల, లౌకికవాదం దెబ్బతింటుంది. ఇక బౌద్ధం భారతదేశంలో సామాజిక, సాంస్కృతిక విప్లవాన్ని, తీసుకువచ్చింది. సమసమాజ భావాన్ని ప్రజ్వలింప చేసింది. మానవతా ధర్మాన్ని ప్రబోధం చేసింది. భారత దేశం నుండి ప్రపంచ దేశాలకు బౌద్ధం విస్తరించింది. డా॥బి.ఆర్.అంబేద్కర్ బౌద్ధాన్ని పునరుద్ధరింప చేసారు. భారతదేశ వ్యాప్తంగా బౌద్ధులు కోట్లాది మంది వున్నారు. వారు ఈనాడు ప్రత్యక్షంగా లేకపోవచ్చు. పరోక్ష రాజకీయ ఉద్యమంలో వున్నారు. తప్పకుండా భారత రాజకీయాల్లో వీరి ప్రభావం స్పష్టంగా వుంది. కమ్యూనిస్ట్‌లు, అంబేద్కర్‌వాదుల అశేషమైన భావజాలం కూడా 2024 ఎన్నికల మీద వుంది. ఇకపోతే ఇండియా కూటమి శివాజీపార్క్‌లో జరిపిన ర్యాలీ కూడా ఎంతో ప్రాధాన్యం వుంది. ఈ ర్యాలీకి "ఇండియా" కూటమికి ఐక్య సంఘటనలోని ప్రధానమైన నాయకులందరూ హాజరయ్యారు. ఇకపోతే 2014లో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన తొమ్మిదేళ్ళ పది మాసాల్లో పెరిగిన నిరుద్యోగం చుక్కల నంటిన నిత్యావసరాల ధరలు, నల్ల ధనాన్ని వెనక్కి తీసుకురావడంలో విఫలం. అమలు కాని ఎన్నికల హామీలు దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడం, సామాన్య మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొన్న అష్ట కష్టాలను ప్రధానాంశంగా ప్రతిపక్షాలు విస్తృతంగా ప్రచారం చేయాలి. ఈనాడు అనివార్యంగా ఓబీసీలకు సీట్లు పెంచవలసిన చారిత్రక అవసరం ముందుకు వచ్చింది. స్త్రీలకు కూడా మునుపటికంటే ఎక్కువ సీట్లు ఇచ్చారు. విద్యాధికులు, రిటైర్డ్ ఆఫీసర్లు, అడ్వకేట్లు, పాత్రికేయ ప్రముఖులు, రిటైర్డ్ జడ్జిలు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు కూడా ఇప్పుడు రాజకీయ రంగంలోకి దూకారు. ఓటు దేశ ప్రజలకు జీవధాతువు. ఐదేళ్ళ మన జీవిత నిర్మాణానికి అది ఒక ఆయుధం. ఓటును మనం దుర్వినియోగం చేసుకున్నాక మన హక్కులన్నీ కాల రాయబడతాయి. ఓటు విలువ అత్యున్నతమైనది. అమూల్యమైనది. ఆ విలువ మానవ విలువలతో సమానమైనది. అందుకే అంబేద్కర్ రాజ్యాధికారమే ప్రధానమైన కీ అన్నాడు. ఆ దిశగా నడుద్దాం. రాజ్యాధికారాన్ని సాధిద్దాం.

# దేవుని మన్నింపు లభించే శుభదినం ఈద్ ఉల్ ఫితుర్



ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సమాజం జరుపుకునే పర్వదినం ఈదుల్ ఫిత్ర్. దైవం ప్రసాదించిన అనుగ్రహాల్లో ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్హా ప్రముఖమైనవి. ఈ పండుగలు తమ స్వభావం రీత్యా అన్ని పండుగల కన్నా ఉత్తమమైనవి. ఇస్లాం ప్రకారం ముస్లింలు జరుపుకుంటున్న ఈదుల్ ఫిత్ర్ మొదటిది. రెండవది ఈదుల్ అజ్హా. రమజాన్ ఉపవాసాలు తు.చ తప్పక పాటించమన్న దైవాదేశానికి అనుగుణంగా ముస్లింలు ఉపవాసాలు పాటించగలిగినందుకు, ఆ తాలూకు ఆనందాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేయడానికి, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోడానికి ఈ పండుగ జరుపుకుంటారు. ఎందుకంటే, దేవుడు మానవులకు అనేక మేళ్ళ చేశాడు. రుజుమార్గం చూపాడు. ఏమార్గం మంచిది.. ఏమార్గం చెడ్డది.. మానవుల సాఫల్య వైఫల్యాలు ఎందులో ఉన్నాయి.. వారి ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాలు ఎలా ఉండాలి.. ఏ సూత్రాలు, నియమాలు పాటిస్తే జీవితం సార్థకమవుతుంది.. ఇత్యాది అనేక మార్గదర్శక సూత్రాలను నేర్పడానికే రమజాన్ నెలలో పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని అవతరింపజేశాడు. ఇంతటి మహత్తర గ్రంథం అవతరించిన నెల ఎంత శుభప్రదమైనదో మనం అర్థం చేసుకోవచ్చు. అందుకే ముస్లింలు పండుగరోజు దేవుని దర్బారులో హాజరై, రమజాన్‌లో ఉపవాసాలు పాటించే శక్తిని, సద్బుద్ధిని ప్రసాదించినందుకు కృతజ్ఞతలు చెల్లించుకుంటారు. కేవలం దేవుని ప్రసన్నత పొందడానికి, పరలోకంలో సత్ఫలితాలు సాధించడానికి రంజాన్ నెలంతా పగటిపూట ఉపవాసాలు పాటించి, రాత్రివేళ తరావీహ్ నమాజుల్లో నిలబడి పవిత్ర ఖురాన్ వినగలగడం నిజంగా దైవానుగ్రహమే. ఈదుల్ ఫిత్ర్ దేవుని మన్నింపు లభించే శుభదినం. దాసుడు ఎలాంటి పరిస్థితిలోనైనా సరే పశ్చాత్తాప హృదయంతో ఆయన వైపుకు మళ్ళదలచుకుంటే దైవం అతణ్ణి తన కారుణ్యఛాయలోకి తీసుకోడానికి సిద్ధంగా ఉన్నాడు. ఒక విషయం యదార్థమని తెలిసినా దానికనుగుణంగా నడుచుకోవడానికి చాలామంది ముందుకు రారు. ఇదే మానవుల బలహీనత. దీన్ని అధిగమించడంలోనే విజ్ఞత దాగి ఉంది. పండుగ రోజు తప్పులకు క్షమాపణ కోరుకునే రోజు. ఇకముందు తప్పులు చేయబోమని, సత్యమార్గంపై స్థిరంగా ఉంటామని దీక్ష వహించాల్సిన రోజు. కాబట్టి ఈనాటి ప్రార్థన దైవం మనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేదై ఉండాలి. పండుగ శుభ సందర్భంగా ఈ విధంగా మనం సంకల్పం చేసుకుంటే అదే నిజమైన పండుగ అవుతుంది. మానవ జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసే శుభదినం అవుతుంది. పండుగ కంటే ముందు ఫిత్రాలు చెల్లిస్తారు. దీనివల్ల పేద సాదలు కూడా కొత్తబట్టలో, పండుగ సామగ్రో కొనుక్కునే అవకాశం కలుగుతుంది. ముస్లిములు, ముస్లిమేతరులు అన్నబేధభావం లేకుండా సమాజంలోని పేదసాదలపట్ల సంపన్నులు తమ బాధ్యతను గుర్తెరిగి మసలుకోవలసిన అవసరాన్ని రమజాన్ గుర్తుచేస్తుంది. అనవసర భోగ విలాసాలకు తమ ధనం వృధా చేయకుండా అగత్యపరులను ఆదుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతుంది. ఉపవాసం పాటించడంవల్ల పేదవాళ్ళ ఆకలి బాధలు అర్థమవుతాయి. సంపన్నులకు, ముప్పూటలా సుష్టుగా తినేవారికి నిరుపేదల ఆకలి కేకలు వినబడవు. అలాంటి వారు గనక ఉపవాసం పాటించినట్లయితే ఆకలి బాధ ఎలా ఉంటుందో వారికీ తెలుస్తుంది. తద్వారా పేదసాదలను ఆదుకోవడం, వారికి పట్టెడన్నం పెట్టడం ఎంత గొప్ప పుణ్యకార్యమో వారు అనుభవ పూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఈద్ రోజు ముస్లింలందరూ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారుచేసిన సేమియా పాయసాన్ని మిత్రులందరికీ ఆప్యాయంగా రుచి చూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు.'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు. ఈ విధంగా ఈదుల్ ఫిత్ర్ పర్వదినం మనిషిని ఒక ఉన్నత మానవీయ విలువలు కలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదరభావాలకు పునాది వేస్తుంది. సమతా మమతలు బోధిస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోదిచేస్తుంది. ఇదే ఈదుల్ ఫిత్ర్ రమజాన్ పర్వదిన పరమార్థం. **(ఈదుల్ ఫిత్ర్ పర్వదినం సందర్భంగా...)**

# పట్టణాల్లో జనాభా ఫుల్... వసతులు నిల్..!



ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మన దేశంలో పట్టణీకరణ అనివార్యమైనప్పటికీ, రాను రాను అదొక పెద్ద సమస్యగా తయారవుతోంది. ఈ విషయం పట్ల అలక్ష్యంగా ఉంటే రానున్న రోజుల్లో అది మరింత జటిలంగా మారే ప్రమాదం ఉందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. పట్టణాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు, విద్య-వైద్య సౌకర్యాలు, ఆధునిక సదుపాయాలు వంటివి పుష్కలంగా ఉండడం ముఖ్యంగా పట్టణీకరణకు లేదా నగరీకరణకు ప్రధాన కారణాలు. దాంతోపాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో పట్టణాలకు వచ్చి స్థిరపడుతుండడం వల్ల కూడా పట్టణాల జనాభా విపరీతంగా పెరిగిపోవడానికి ఒక కారణంగా ఉంటోందని నిపుణులు చెప్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా గుట్టలుగుట్టలుగా పెరిగిపోతున్న నేటి కాలంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో అధిక జనాభా గల భారత్ వంటి దేశాలు ప్రజలకు అవసరమైన వసతులు కల్పించడానికి నానా బాధలు పడాల్సివస్తుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మరో వందేళ్ళలో మనదేశ జనాభా మరింతగా పెరిగిపోవడమే కాక, నగర జనాభాల్లో ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలు ప్రపంచ నగరాల్లోనే అగ్రభాగాన నిలిచే పరిస్థితి ఉందని కూడా అంటున్నారు. అందులోనూ, వ్యవసాయమే ప్రధానంగా ఉన్న మనదేశంలో..గ్రామాల్లో సేద్యం, చేతివృత్తుల వంటివి క్రమేణా కష్టాలమయంగా తయారవడంతో పేద, మధ్యతరగతి రైతు కుటుంబాల వారు ఉపాధి కోసం ఎక్కువగా పట్టణాల వైపు చూస్తున్నారు. ఉన్నత విద్యల కోసం పట్టణాలకు, లేదా నగరాలకు వెళ్లక తప్పని కుటుంబాలు ఇంకొన్ని. గ్రామీణ యువత కూడా అధికభాగం ఆధునిక వసతులున్న పట్టణాలకు వెళ్ళడానికే ఇష్టపడుతున్నారు. మరోవైపు కూలిపనులు కూడా దొరక్క అవస్తలు పడుతున్న నిరుపేద కుటుంబాల వారు కూడా తట్టాబుట్టాతో పాటు కడుపు చేతపట్టుకుని, ఏదోఒక పని చేసుకుని బతుకుదామనే ఆశతో పట్టణాలకు పోతున్నారు. దీంతో పల్లె జనాభా తగ్గడం, పట్టణ జనాభా పెరగడం కూడా తప్పనిసరి అవుతోంది. పట్టణాలకు వచ్చే జనానికి తగ్గ వసతులు కల్పించలేక పట్టణాల్లోని పాలకులు లేదా అధికారగణం తలలు పట్టుకునే పరిస్థితి వచ్చేస్తోంది. ముఖ్యంగా దేశంలోని అనేక పట్టణాలు, నగరాల్లో ఇప్పటికే కోట్లాదిమంది పేదజనం నివసించే ప్రాంతాలు మురికివాడలుగా మారి ఎంతో దయనీయంగా, దుర్భరంగా ఉంటున్నాయి. నేటికీ మంచినీటి వసతులు, పారిశుద్యం వంటి మౌలిక సదుపాయాలు కూడా కరువై, కాలుష్యం భయంకరంగా పెరిగిపోయి నిత్యం వేలాది మంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇదే అదనుగా పట్టణాల్లో భూముల ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. ఏదైనా అద్దె ఇంట్లో ఉండి ఉపాధి చూసుకుందామనుకునేవారికీ చుక్కలు కనిపిస్తున్నాయి. నగరాల్లో అద్దెఇంటి కోసం రోజుల తరబడి కాళ్ళరిగేట్లు తిరిగినా ఇల్లు కల్లగా మారుతోంది. ఇలాంటి కష్టాలను అధిగమించి ఉన్నతస్థాయికి చేరుతున్నవారి సంఖ్య తక్కువే అనవచ్చు. ఈ నేపథ్యంలో నిరుపేదల గోడు మరింత దయనీయం. పొట్ట చేతపట్టుకుని పట్టణాలకు తరలివచ్చిన వేలాదిమంది కూలీలు, కార్మికులకు సరైన జీవనభృతి కరువవుతోంది. కొద్దో గొప్పో చదువుకున్నవారు కూడా కుటుంబ పోషణకు కూలిపనులు చేసుకోవాల్సిన దుర్గతి మరింత హృదయవిదారకంగా ఉంటోంది. ఈ అవస్తలు చాలవన్నట్లు, కొన్నిప్రాంతాల్లో పల్లెల నుంచి పట్టణాలకు వచ్చిన యువత తమ గ్రామీణ సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి నగరాల్లోని పాశ్చాత్య ధోరణులకు అలవాటుపడి, పెడ దారి పడుతుండడం విచారకరం. ఏదేమైనా.. అది పల్లెయినా, పట్టణమైనా, నగరమైనా ప్రతిఒక్కరికీ జీవనోపాధి కల్పించడం, మనిషి బతుకు జీవనానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కలిగించడం పాలకుల, ప్రభుత్వాల కనీసధర్మం. ప్రపంచంలోనే జనాభాలో నెంబర్-1గా ఉన్న మనదేశంలో..పుష్కలంగా ఉన్న శ్రమశక్తిని, మానవవనరులను సద్వినియోగం చేసుకోగలిగితే అభివృద్ధి లోనూ మనకిక తిరుగులేదని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్రప్రభుత్వంతో పాటు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా ఇకనైనా ఆ దిశలో ఆలోచించి పట్టణీకరణ సమస్యలపై దృష్టిపెట్టి, దేశం ప్రగతిపథంలో సాగేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. పట్టణాలకు -నగరాలకు ఉపాధి కోసం వచ్చిన వారి స్థితిగతులను పరిశీలించి, సమస్యలను తీర్చగలిగితే.. దేశంలో ఆర్థిక ఉత్పాదకశక్తి బాగా పెరుగుతుంది. ఏదేమైనా, అసలే అధికజనాభాతో సతమతమవుతున్న మనదేశంలో, పట్టణీకరణ- నగరీకరణల వల్ల ఇప్పుడే కాదు.. భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు లేకుండా ముందుచూపుతో.. ప్రభుత్వాలు తగు ప్రణాళికలను అమలుచేయాల్సి ఉంది.

# పదవులు ఒకరివి... పెత్తనం వారసులది..!




నేడు ప్రజాప్రతినిధులు ఎవరు పదవుల్లో వున్నా... వారి ప్రాబల్యంకంటే వారి వారసులది, కుటుంబసభ్యులది, బంధువులది పెత్తనం పెరిగిపోతోంది. ప్రతి ప్రభుత్వ విభాగంలో వీరి ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచ్‌లు, మండలాధ్యక్షులు, నగరాల్లో అయితే కార్పొరేటర్లు, మున్సిపాలిటీల్లో అయితే కౌన్సిలర్లు ఎవరు అధికారంలో వున్నా వారి వారసులు ప్రభుత్వ విభాగాలను శాసించే దుస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ, నడిచేదంతా పెత్తందారీతనమని, వీరి ఆగడాలు చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. నెల్లూరు నగరంలో ప్రతి కార్పొరేటర్ తన పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలను, పోలీస్ స్టేషన్లను గుప్పిట్లో ఉంచుకొని అజిమాయిషీ కొనసాగిస్తూ దందాలు చేస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ముఖ్యంగా నెల్లూరు నగరపాలక సంస్థలో కార్పొరేటర్ల వారసులు, మహిళా కార్పొరేటర్ల భర్తలు వీరి ఆధిపత్యంలోనే పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదుచేస్తున్నారని, వీరు చెప్పినవిధంగానే పంచాయితి నిర్వహించి కేసులను బలహీన పరుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్కడ వరకే కాకుండా తహసిల్దారు కార్యాలయం, సివిల్ సప్లైస్ విభాగం, మున్సిపాలిటీ తదితర నిత్యం ప్రజాసమస్యలను పరిష్కరించే వేదికల్లో వీరి ఆధిపత్యం మరీ పెరిగిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒక కార్పొరేటర్ భర్త పోలీస్ స్టేషన్లనే గుప్పెట్లో వుంచుకొని దందాలు నిర్వహిస్తూ... అక్రమార్జనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వున్నాయి. అలాగే బిట్-2లో ఒక కార్పొరేటర్ కుమారుడు పోలీస్‌స్టేషన్‌ను తన కనుసన్నల్లోనే నడిపిస్తున్నాడని స్థానికులు విమర్శిస్తున్నారు. మరికొంతమంది కార్పొరేటర్లు తహసిల్దారు కార్యాలయాన్ని వేదికగా చేసుకొని ఆదాయ ధృవీకరణ పత్రాలు, కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయించడంలో కూడా తమ ఆధీనంలోనే కొనసాగిస్తున్నారన్న విమర్శలు వున్నాయి. అలాగే మున్సిపల్ కార్పొరేషన్‌ను వేదికగా చేసుకొని కొంతమంది కార్పొరేటర్లు దందా కొనసాగిస్తున్నారని, జనన మరణ ధృవీకరణ పత్రాలను మంజూరు చేయించడానికి చేయి తడపాల్సి వస్తోందన్న విమర్శలు కోడైకూస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి కార్పొరేటర్ తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ను, తహసిల్దారు కార్యాలయాన్నో, మున్సిపల్ కార్యాలయాన్నో శాసించే స్థాయిలో వున్నట్లు సమాచారం. ఆయా కార్యాలయాల్లో ఏ పనులు చేయాలన్నా వీరికి ముందస్తు సమాచారం వుండాల్సివుంది, తస్మదీయులు, అస్మదీయులు అనేవిధంగా విభజించి పనులు చక్కబెట్టి తమ పబ్బం గడుపుకుంటున్నట్లు సమాచారం. వీరి ఆధిపత్యం, ఆగడాలను తట్టుకోలేక యంత్రాంగం ఇబ్బంది పడుతుంటే... వీరి వారసుల పెత్తనం మరింత పెరిగిపోయి ప్రభుత్వ సిబ్బందికి తలనొప్పిగా మారిందనేది సమాచారం. ఇలా ప్రతి విభాగంలోనూ ప్రజాప్రతినిధులుగా వున్నవారి ఆధిపత్యం కంటే కూడా వారి వారసుల ఆధిపత్యం పెరిగిపోయి బెదిరింపులు, దౌర్జన్యాలు, దందాలు కొనసాగించేవిధంగా తయారైంది. దీంతో వ్యవస్థ నిర్వీర్యమౌతోందని మేధావి వర్గం విమర్శిస్తోంది. విద్యాశాఖలో సైతం ఉపాధ్యాయుల బదిలీల దగ్గరనుండి విద్యార్థుల చేరిక వరకు వారసుల ఆధిపత్యంలోనే కొనసాగుతోందని పలువురు ఉపాధ్యాయ మిత్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. నిత్యం ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిన వేదికలు, మరికొన్ని నిత్య ప్రజాసంబంధాలు కలిగిన ప్రభుత్వ శాఖలు సివిల్ సప్లైస్ లాంటివి, మున్సిపల్ కార్యాలయాల్లో వీరి ఆధిపత్యం కొనసాగుతోందని, సిబ్బందితోపాటు అదే విభాగాల్లో వీరు సైతం కుర్చీలు వేసుకొని దందా కొనసాగిస్తున్నారనేది సమాచారం. ఉన్నతాధికారులు ఇంత జరుగుతున్నా... పట్టించుకోవడం లేదనే విమర్శలు వున్నాయి. ప్రజలతో సంబంధాలు కలిగిన ప్రజాప్రతినిధులు వారివారి ప్రాంతాల్లో ప్రజాసమస్యలను తీసుకువచ్చి సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యాసాధ్యాలను దృష్టిలో వుంచుకొని పరిష్కరించే అవకాశం, వెసులుబాటు వుంటుంది. అయితే ఎలాంటి అధికారము, అవగాహన లేకుండా ఈ ప్రజాప్రతినిధుల వారసులు వచ్చి యంత్రాంగంపై ఆధిపత్యం కొనసాగించటం సరికాదని, మేధావి వర్గం అభిప్రాయపడుతోంది. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు ఆత్మపరిశీలన చేసుకొని తమ పరిధిని దాటిపోకుండా వ్యవహరించి ప్రజావిశ్వాసం పొందాల్సిన అవసరం ఎంతైనా వుంది. అదేవిధంగా ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతనిస్తూ... అధికారయంత్రాంగం వారి వారసులను కార్యాలయాల్లో ప్రవేశించే అవకాశం లేకుండా కట్టడి చేయాల్సిన అవసరం వుంది.

తేది : 12- 04-2024 ఆంధ్రలక్ష్మి 8 సంపుటి : 15 సంచిక : 31

# అధికార దుర్వినియోగమా? అవినీతిపై పోరాటమా..?

కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింప చేసింది ఇన్‌కంట్యాక్స్ విభాగం. దానిలో వున్న 130 కోట్ల రూపాయలూ ప్రభుత్వ ఖజానాకు తరలించి వేసింది. అది చాలదన్నట్లు అదనంగా 3760 కోట్ల రూపాయల పెనాల్టీ విధించింది. ఒకవేళ ఎవరైనా కొత్తగా విరాళాలు ఇస్తే, వాటిని కూడా కాంగ్రెస్ వాడుకోలేని పరిస్థితి కల్పించ డానికే ఈ పెనాల్టీ నోటీసులీ ఈ చర్యలకు అర్థం – ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేతిలో చిల్లిగవ్వ లేకుండా చేయడమన్న మాట. రాజకీయ పార్టీ లకు ఎన్నికలలో చాలా ఖర్చులుంటాయి. జెండా లు, బ్యానర్ల వంటి ప్రచార సామగ్రి భారీ స్థాయి లో తయారుచేసి దేశమంతా పంపాలిబీ జాతీయ నాయకులు దేశ వ్యాప్త పర్యటనలు చేయడానికి హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలు సమకూర్చాలిబీ తతిమా నేతల పర్యటనకు విమానం టికెట్లు, హోటల్ గదులు ఏర్పాటు చేయాలిబీ పార్టీ మ్యానిఫెస్టో, ఎన్నికల హామీలతో పత్రికలలో, టీవీలలో ప్రకటనలివ్వాలిబీ కొన్ని వందల బహి రంగ సభలు నిర్వహించాలి. వాటికి వేదికలు కట్టాలి, వాహనాలు సమకూర్చాలి, భద్రతా ఏర్పాట్లు చేయాలి, వీటన్నిటికీ డబ్బు కావాలి. బిజెపి వద్ద అపారమైన ధన రాశులున్నాయి. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారానే 12వేల కోట్ల రూపా యలు వచ్చాయి. నల్లధనం అంతకు పది రెట్లు వచ్చి వుంటుందిబీ విమానాలు, హెలికాప్టర్లు ఉచితంగా ఇవ్వడానికి అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలు కాచుకొని వుంటారు. బిజెపికి ప్రధాన ప్రత్యర్థి – కాంగ్రెస్. 2019 ఎన్నికలలో బిజెపికి 37 శాతం ఓట్లు వస్తే, కాంగ్రెస్‌కు 20 శాతం ఓట్లు వచ్చాయి. ఒక పార్టీ ఎన్నికలలో ఖర్చు చేయడానికి వేల కోట్ల మూటలు దాచు కొని వుంటే, ప్రత్యర్థి పార్టీ అదే ఎన్నికలలో పోటీ పడడానికి చేతిలో చిల్లి గవ్వలేకుండా చేయడ మేమిటి? వీటిని ఎన్నికలు అంటారా? దీన్ని ప్రజాస్వామ్యం అని పిలవాలా? సరిగ్గా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను స్తంభింప చేసే సాహసం ఇన్‌కం ట్యాక్స్ అధికా రులు తీసుకొన్నారంటే, చెవిలో పువ్వు పెట్టుకొన్న వాడు కూడా నమ్మడు. గత పదేళ్లుగా ఈడి, సిబిఐ, ఇన్‌కంట్యాక్స్ సంస్థలు మోడీ చెప్పిన పనులు మాత్రమే చేస్తున్నాయన్నది జగమెరిగిన సత్యం. ప్రతిపక్షాల పీక నులిమితే తప్ప 400 స్థానాల ఘన విజయం దక్కదన్న భయంతోనే నరేంద్రమోడీ ఈ అకృత్యాలకు పాల్పడుతున్నాడని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఢిల్లీ ముఖ్య మంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. పది రోజులు విచారణ పేరుతో హింసించి, తీహార్ జైలుకు పంపించారు. పోలింగ్ ముగిసే వరకు ఆయనకు బెయిల్ లభించే అవకాశం కన్పించడం లేదు. ఆయన చేశాడని చెప్తున్న నేరం – ఢిల్లీ మద్యం విధానం రూపకల్పనలో కొందరు వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చి వంద కోట్ల రూపాయల లంచం తీసుకొన్నాడనిబీ అయితే ఆ లంచం సొమ్ము ఆయన తీసుకొన్నట్లు ఒక్క ఆధారం దొరకలేదు, మనీ ట్రైల్ కనిపెట్టడం వీలు కాలేదు. లంచం ఇచ్చామని కొందరు వ్యాపారులు చెప్పిన మాటల ఆధారంగా మాత్రమే అరెస్ట్ చేశారు. అట్లా చెప్పిన వారిలో అరబిందో ఫార్మా కంపెనీ అధినేత శరత్ చంద్రారెడ్డి ఒకరుబీ ఆయన బెయిల్ మీద విడుదల కాగానే మోడీ పార్టీకి 52 కోట్ల రూపాయల లంచం ఇచ్చాడు. దీన్నిబట్టి – ఎవరిది అవినీతి, ఎవరు జైలులో వుండాలి? కేజ్రీవాల్ ఉత్తర భారత దేశంలో ఒక నూతన రాజకీయ శక్తిగా ఆవిర్భ విస్తున్నాడు. ఆయన ప్రభావం ఢిల్లీకి పరిమితం కాదు. పంజాబ్‌లో బిజెపి, కాంగ్రెస్‌లను ఓడించి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. గుజరాత్, రాజస్థాన్, మహా రాష్ట్ర వంటి ప్రాంతాలలో కూడా కేజ్రీవాల్ ప్రజాభిమానం పొందుతున్నాడు. ఈ ఎన్నికలలో ఆయన కాంగ్రెస్‌తో చేతులు కలిపి, ఇండియా కూటమిలో చేరితే, ఉత్తర భారత దేశంలో తాను దెబ్బతింటానన్న భయం వుంది మోడీలో. అందుకే ఆయన్ను జైలులోకి నెట్టారు. లంచం తీసుకొ న్నట్లు రుజువు లేకుండా ఒక ముఖ్యమంత్రిని జైలులో పెట్టడం అధికారాన్ని దుర్వినియోగం చేయడమా? అవినీతిపై పోరాటం చేయడమా? ఈ ప్రశ్న మనకే కాదుబీ అంతర్జాతీయ సమా జానికి కూడా ఎదురౌతున్నది. అమెరికా, జర్మనీ దేశాలతో పాటు ఐక్యరాజ్య సమితి కూడా కేజ్రీ వాల్ అరెస్ట్, కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాల స్తంభన మీద సున్నితమైన విమర్శ చేశాయి. భారత దేశంలో న్యాయ వ్యవస్థ నిష్పాక్షికంగా నడుచు కొంటుందని, ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయని ఆశిస్తున్నామని వ్యాఖ్యానించాయి ఆ దేశాలు. అంటే, భారతదేశంలో న్యాయ వ్యవస్థ నిష్పాక్షి కంగా లేదని వారి అనుమానం అన్న మాట. మన న్యాయ వ్యవస్థకు ఇంతకంటే అవమానం ఇంకొకటి వుండదు.!

# నేటికీ మారనీ ఏఆర్ కానిస్టేబుల్ పరిస్థితి..!

నలభై ఏళ్ల కిందటనే "ముప్పైయేండ్లు నిండిన గానీ మూడుపట్టీలు రాకపాయేరో ఓ పోలీసన్నా" అంటూ ప్రముఖ వాగ్గేయకారుడైన గద్దరన్న బృందం పాట రూపంలో చెప్పారు. ఇదంతా నేటికీ మారనీ కానిస్టేబుల్ పరిస్థితికి అద్దం పడుతుంది. ప్రభుత్వాలు ఎన్ని మారినప్పటికీ నేటికీ తెలుగు నాట పోలీసుశాఖలో పని చేస్తున్నటువంటి ఏఆర్ పోలీసులకు కన్వర్షన్ వంటి సమస్యలపై ఎలాంటి న్యాయం జరగలేదు. వివిధ రకాలుగా రక్షణగా నిలుస్తున్న ఏఆర్ విభాగపు పోలీసులకు ఎవరూ దిక్కులేరనే చెప్పుకుని తీరాలి. ఈ శాఖలో అనేక రకాలైన వివక్షా పూరితమైన సిస్టం వీరిపట్ల అమలౌతూ వుంటుంది. రాష్ట్రంలో మిగతా పోలీసులతో పోల్చుకుంటే వీరికి మాత్రమే అన్యాయం జరుగుతూనే ఉంటుంది. వీరి పక్షాన మాట్లాడి న్యాయం చేసిన ప్రభుత్వాలు లేవు. వీరి కోసం గొంతు విప్పిన ప్రజాప్రతినిధి గానీ లేదా మాన వతావాది కూడా ఏ ఒక్కరూ లేరనే చెప్పుకోవాలి. చాలామందికి పోలీసు అనగానే అందరూ స్టేషన్లో పనిచేసేవారే అనుకుంటారు. కానీ ఇందులో నానారకాల పోలీసులు ఉంటారనేది పచ్చి నిజం. రాష్ట్ర పోలీసు శాఖకు కూడా భర్తీ విధానం ఈ మూడు వింగ్స్ నుండే జరుగుతుంది. ఒకరు శాంతి భద్రతల విభాగం పోలీసులు, మరొకరు స్పెషల్ పోలీసులు... వీరినే బెటాలియన్ పోలీ సులు అంటారు. ఇక మూడో వింగ్‌కి చెందిన వారు ఏఆర్ పోలీసులు. వీరు జిల్లా ఆర్మ్డ్ పోలీసుగా విధులు నిర్వహిస్తూ ఉంటారు. ప్రధా నంగా వీరు జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్తులకు, ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించడం, ఖైదీలకు, వీఐపీలకు, వీవీఐపీలకు ఎస్కార్ట్ విధులు నిర్వ హిస్తూ ఉంటుంటారు. చిత్రమో లేక విచిత్రమో



గానీ వివిధ రకాలుగా రక్షణగా నిలుస్తున్న ఏఆర్ విభాగపు పోలీసులకు ఎవరూ దిక్కులేరనే చెప్పు కుని తీరాలి. జిల్లా ఆర్మ్డ్‌గా విధులు నిర్వహించే పోలీసులకు ఎలాంటి ప్రత్యేక పరపతి లేకపోగా వీరు కేవలం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పనిచేస్తూ ఉంటారు. పోలీసు వాహనాలకు డ్రైవర్లుగా, ప్రజా ప్రతినిధులకు గన్‌మెన్లుగా, ప్రభుత్వ సంస్థలకు గార్డు విధులు నిర్వహిస్తూ ఉంటారు. వీరికి రాష్ట్రంలో మిగతా పోలీసులతో పోల్చుకుంటే వీరికి మాత్రమే అన్యాయం జరుగుతూనే ఉం టుంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని ఏఆర్ పోలీసులకు జరుగుతున్న అన్యాయంలో అతి పెద్దది కన్వర్షన్ విధానం. ఏఆర్ విభాగంలోకి కన్వర్షన్ ద్వారా వచ్చే బెటాలియన్ పోలీసులకు (స్పెషల్ ) కేవలం పది సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని ఉంటే సరిపోతుంది. ఇదే ఏఆర్ పోలీసులు శాంతి భద్రతల (సివిల్) విభాగంలోకి పోవాలంటే నలభై సంవత్సరాల వయస్సు నిండినవారై ఉండాలట. ఇదెక్కడి న్యాయం!? అంటే పద్దెనిమిది సంవత్సరాల వయస్సులో ఏఆర్ విభాగంలో భర్తీ అయిన పోలీసు కాని స్టేబుల్ సివిల్ పోలీసులోకి కన్వర్షన్ పోవాలంటే దాదాపుగా 22 సంవత్సరాలపాటు సర్వీసు పూర్తి చేసుకుని ఉండాలి. అదే స్పెషల్ పోలీసు వాళ్ళ ఏఆర్ విభాగంలోకి కన్వర్షన్ ద్వారా రావాలంటే కేవలం పది సంవత్సరాల సర్వీసు ఉంటే చాలు నట. ఇదెక్కడి పోలీసు నీతి!? సరే పోనీ ఇదే పద్ధతి స్పెషల్ పోలీసుల్లో గానీ లేదా ఏఆర్ విభాగంలో భర్తీ అయినటువంటి ఆఫీసర్లకు ఉండదు. కేవలం ఈ విభాగాలలో భర్తీ అయినటు వంటి ఆర్ఎస్ఐలకు (రిజర్వుడు సబ్–ఇన్‌స్పెక్టర్) కేవలం ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసు కుని ఉంటే చాలు, డైరెక్ట్‌గా వీరిని సివిల్ పోలీసు విభాగంలోకి కన్వర్షన్ ద్వారా అనుమతినిస్తారు. మరీ ఇదెక్కడి ధర్మం!? ఇదంతా ఇలా ఉంటే కానిస్టేబుల్‌గా భర్తీ అయినవారికి ప్రమోషన్లు అనుకున్న సమయంలో రానే రావనేది గత నలభై యేండ్ల కిందటనే "ముప్పైయేండ్లు నిండిన గానీ మూడు పట్టీలు రాకపాయేరో ఓ పోలీసన్నా" అంటూ ప్రముఖ వాగ్గేయకారుడైన గద్దరన్న బృందం పాటరూపంలో చెప్పారు. ఇదంతా నేటికీ మారనీ కానిస్టేబుల్ పరిస్థితికి అద్దం పడుతుంది. ప్రమోషన్లు రాకపోవడం ఒక బాధైతే ఈ కన్వర్షన్ విధానంలో కేవలం ఏఆర్ కానిస్టేబుల్ వారికి వయస్సు పరిమితిని అమలు చేస్తూ వీరి వయస్సు పైన, కన్వర్షన్ ఆశలపైన, క్లీన్ సర్వీస్ రికార్డుల పేరిట ఏఆర్ కానిస్టేబుల్ జీవితాలపైన మరొక తూటాను ఎక్కుపెట్టి డిపార్ట్‌మెంట్ పెద్దలు పేల్చు తూనే ఉన్నారు. అన్ని విభాగాల్లో పని చేస్తున్నటు వంటి కానిస్టేబుల్ కిందిస్థాయి ఉద్యోగులకు రక్షణ నిలుస్తున్నటువంటి జీ.వో నెం.679 అనేది అసలు అమలుకే నోచుకోని పరిస్థితి ఉన్నది. ఈ జీవో ప్రకారం సస్పెన్షన్ వంటి పరిస్థితి సద రు పోలీసు ఎదుర్కొంటున్నప్పుడు ఓరల్ ఎంక్వరీ పేరిట సంవత్సరాల తరబడి కాలయాపన చేయ కుండా వెంటనే మూడు నెలల కాలపరిమితి లోపల తగు న్యాయం చేయాల్సిందిగా 2008 నవంబర్ 1న ఆనాటి ప్రభుత్వ కార్యదర్శి అయిన రమాకాంత్ రెడ్డి ఈ జీవోను ఇచ్చారు. ఈ జీవో ప్రకారమైనా న్యాయం జరిగిన లేదా పొందిన కిందిస్థాయి పోలీసులు లేరనే చెప్పుకోవాలి. ఇలాంటి పరిస్థితి ఉండటం వలన పనిష్మెంట్ అనేది పెండింగ్‌లో ఉండటం వలన కన్వర్షన్ సమయంలో ఏఆర్ పోలీసులకు ఇదికూడ మరొక శాపంలా మారిపోయింది. గత ప్రభుత్వాలు ఎన్ని మారినప్పటికీ తెలుగు నాట పోలీసు శాఖలో పని చేస్తున్నటువంటి ఏఆర్ పోలీసులకు ఎలాంటి న్యాయం జరగలేదు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా ఏఆర్ పోలీసులకు కన్వర్షన్ వయోపరిమితిని తగ్గించాలి. అలాగే ఎలాంటి పనిష్మెంట్ ఉన్నప్పటికీ కన్వర్షన్‌కు అడ్డురాకుండా వేలాదిమంది ఏఆర్ పోలీసులకు న్యాయం చేస్తుందేమో వేచి చూడాలి.

Edited, Printed, Published and Owned by Shaik Ghouse Basha, Printed at Mohammed Press, D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001, Andhra Pradesh, Publihsed at D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001. Andhra Pradesh,
Editor : Shaik Ghouse Basha Cell : 9640300529